ప్రజానేస్తం జ్వాల

నిజం కోసం... నిర్భయంగా...

www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com



నవంబర్ 16 సోమవారం 2026 | సంపుటి : 1 | సంచిక : 37 | పేజీలు : 6 | వెల రూ. 4.00/- | ఎడిటర్ : చెన్నగాని పురుషోత్తం

MONDAY NOVEMBER 16 2026 | VOL:1 | ISSUE: 37 | PAGES:6 | Rs. 4:00 | EDITOR: CHENAGANI PURUSHOTHAM

రాహుల్ గాంధీకి సీఎం బాడీగార్డ్‌లా వ్యవహరిస్తున్నారు: కేటీఆర్ విమర్శలు

- కాంగ్రెస్ బీజేపీ నేతల తీరుపై కేటీఆర్ తీవ్ర విమర్శలు
- రాహుల్ బైక్ వెనుక మంత్రులు పరిగెత్తడంపై ఆగ్రహం
- తెలంగాణ పునాది ఆత్మగౌరవమన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్
- ప్రభుత్వ కార్యక్రమాల్లో రాహుల్ ప్రొటోకాల్‌పై బీఆర్ఎస్ ప్రశ్నలు
- ఫిట్‌గా ఉన్నందునే పరిగెత్తానన్న పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్



తెలంగాణ రాష్ట్రం ఆత్మగౌరవం అనే ప్రాతిపదికన ఏర్పాటయిందని, అయితే కాంగ్రెస్, బీజేపీ పార్టీలు ఈ విషయాన్ని ఎప్పటికీ అర్థం చేసుకోలేవని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. శనివారం హైదరాబాద్‌లో కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పాల్గొన్న కార్యక్రమాల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి, మంత్రుల తీరుపై ఆయన సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా తీవ్రంగా స్పందించారు. తెలంగాణ కాంగ్రెస్, బీజేపీ నేతలకు పదవుల తాలూకు హుందాతనం, గౌరవం తెలియకుండా పోయిందని కేటీఆర్ ధ్వజమెత్తారు. గాంధీ కుటుంబానికి రాష్ట్ర ముఖ్యమంత్రి

(మిగతా 2వ పేజీలో..)

ప్రధాని మోదీతో భేటీ అయిన రేవంత్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి

- రాష్ట్రంలో కరవు నివారణ చర్యల కోసం రూ.30 వేల కోట్ల ప్యాకేజీ ఇవ్వాలని విజ్ఞప్తి
- ఎల్‌నినో ప్రభావంతో తెలంగాణలో నమోదైన 17 శాతం లోటు వర్షపాతంపై ప్రధానికి వివరణ
- ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్, ఖేలో ఇండియా క్రీడలకు ప్రధానికి ఆహ్వానం

ఢిల్లీలో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాసేపటి క్రితం సమావేశమయ్యారు. రాష్ట్రంలో నెలకొన్న తీవ్ర వర్షాభావ, కరవు పరిస్థితులను అధిగమించడానికి, రైతులను ఆదుకోవడానికి తక్షణమే రూ.30 వేల కోట్ల ఆర్థిక సహాయాన్ని ప్యాకేజీ రూపంలో అందించాలని ప్రధానికి విజ్ఞప్తి చేస్తూ ఒక వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ భేటీలో ముఖ్యమంత్రితో పాటు మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, వాకిటి శ్రీహరి పాల్గొన్నారు. కేంద్ర మంత్రి మన్సుఖ్ మాండవీయ కూడా ఈ సమావేశంలో ఉన్నారు. ఎల్‌నినో ప్రభావం వల్ల రాష్ట్రవ్యాప్తంగా వర్షపాతం తీవ్రంగా

(మిగతా 2వ పేజీలో..)



ఫోన్ ట్యాపింగ్ కేసులో ఫైనల్ ఛార్జ్‌షీట్.. కేసీఆర్, కేటీఆర్‌లకు బిగుస్తున్న ఉచ్చు!

- ఫోన్ ట్యాపింగ్ కేసులో తుది ఛార్జ్‌షీట్ సిద్ధం చేస్తున్న సిట్
- కేసీఆర్‌ను ఏ1, కేటీఆర్‌ను ఏ2గా పేర్కొనేందుకు సన్నాహాలు
- ఫోరెన్సిక్, సాంకేతిక ఆధారాలతో పటిష్ఠంగా ఛార్జ్‌షీట్ రూపకల్పన
- ఎలక్టోరల్ బాండ్ల కోసం బెదిరింపుల ఆరోపణలపై కీలక వాంగ్మూలం
- ప్రభుత్వ ఉన్నతాధికారులు, ప్రైవేటు వ్యక్తుల పాత్రపైనా ప్రస్తావన



తెలంగాణ రాజకీయాల్లో సంచలనం సృష్టిస్తున్న ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తు తుది దశకు చేరుకుంది. ఈ కేసులో నాటి ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు (కేసీఆర్)ను ప్రధాన నిందితుడిగా (ఏ1), ఆయన కుమారుడు, మాజీ మంత్రి కేటీఆర్‌ను రెండో నిందితుడిగా (ఏ2) పేర్కొంటూ తుది ఛార్జ్‌షీట్ దాఖలు చేసేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) సిద్ధమవుతున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. చట్టవిరుద్ధమని తెలిసినప్పటికీ ఫోన్ ట్యాపింగ్‌కు అనుమతులు ఇచ్చారని, తమకు అనుకూలంగా ఉండే అధికారులను ఇంటెలిజెన్స్, ఎస్ఐబీ వంటి కీలక విభాగాల్లో నియమించి ఈ అక్రమాలకు పాల్పడ్డారని సిట్ భావిస్తోంది. ప్రజాప్రతినిధులు, న్యాయమూర్తులు, జర్నలిస్టులు, వ్యాపారవేత్తలతో పాటు పలువురు సెలబ్రిటీల ఫోన్లను ట్యాప్ చేయడం వెనుక భారీ కుట్ర ఉందని దర్యాప్తులో తేలినట్లు తెలుస్తోంది. దీనిపై సిట్ అధికారులు ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వివరించినట్లు సమాచారం. ఈ ఆరోపణలకు బలం చేకూర్చేలా వందలాది మంది బాధితుల వాంగ్మూలాలను, బలమైన ఫోరెన్సిక్, సాంకేతిక ఆధారాలను సిట్ సేకరించింది. ఫోన్ ట్యాపింగ్ ద్వారా సేకరించిన సమాచారంతో బెదిరింపులకు పాల్పడి, ఎలక్టోరల్ బాండ్ల రూపంలో విరాళాలు సేకరించారన్న ఆరోపణలకు సంబంధించి ఓ ప్రముఖ రియల్ ఎస్టేట్ వ్యాపారి ఇచ్చిన వాంగ్మూలం ఈ కేసులో అత్యంత కీలకంగా మారనుంది. ఛార్జ్‌షీట్‌ను పటిష్ఠంగా రూపొందించేందుకు సుప్రీంకోర్టు న్యాయనిపుణుల సలహాలు కూడా తీసుకున్నారు. కేసీఆర్‌ను ప్రధాన సూత్రధారిగా పేర్కొంటూ, మావోయిస్టుల పేరిట నంబర్లకు అనుమతిచ్చిన ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, ఈ వ్యవహారంలో సహకరించిన ప్రైవేటు వ్యక్తుల పేర్లను కూడా ఛార్జ్‌షీట్‌లో చేర్చనున్నట్లు సమాచారం. మరోవైపు, దర్యాప్తు వివరాలు బయటకు పొక్కుతుండటంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల పోలీసు ఉన్నతాధికారులపై అసహనం వ్యక్తం చేసినట్లు తెలిసింది.

దూసుకొస్తున్న ఆక్వాన్ తుపాను.. తెలంగాణలో ఏయే జిల్లాలకు పొంచిరికే

- నవంబర్ 20న తుపాను ఉత్తర కోస్తాంధ్ర తీరాన్ని దాటే అవకాశం
- నవంబర్ 20 నుంచి 22 వరకు తెలంగాణలోని తూర్పు, దక్షిణ జిల్లాలో విస్తారంగా వానలు
- 21, 22 తేదీల్లో ఇతర జిల్లాలో కూడా కురవనున్న వర్షాలు

బంగాళాఖాతంలో ఏర్పడిన వాతావరణ మార్పుల కారణంగా తెలుగు రాష్ట్రాలకు తుపాను ముప్పు పొంచి ఉంది. ఆగ్నేయ బంగాళాఖాతంలో కొనసాగుతున్న తీవ్ర అల్పపీడనం క్రమంగా వాయుగుండంగా మారి, తుపానుగా బలపడే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించింది. ఈ తుపానుకు 'అక్వాన్' అని నామకరణం చేశారు. ప్రస్తుతం అందుతున్న సమాచారం ప్రకారం, ఈ తుపాను ఉత్తర-వాయువ్య దిశగా ప్రయాణించి నవంబర్ 20 నాటికి ఉత్తర కోస్తాంధ్ర తీరాన్ని దాటే అవకాశాలు ఉన్నాయి. దీని ప్రభావంతో నవంబర్ 20 నుంచి 22 వరకు తెలంగాణలోని తూర్పు, దక్షిణ జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. 21, 22 తేదీల్లో రాష్ట్రంలోని ఇతర జిల్లాల్లో కూడా తుపాను ప్రభావం కనిపిస్తుందని అధికారులు తెలిపారు.



హరీశ్ రావు తండ్రి సంవత్సరీకం.. హాజరైన కేసీఆర్, కేటీఆర్

- కోకాపేటలోని హరీశ్ రావు నివాసానికి వెళ్లిన కేసీఆర్
- హరీశ్ రావు తండ్రి సత్యనారాయణరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళి
- హరీశ్ రావు కుటుంబ సభ్యులను పరామర్శించిన గులాబీ బాస్
- కార్యక్రమంలో పాల్గొని శ్రద్ధాంజలి ఘటించిన కేటీఆర్
- హాజరైన మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్, ఇతర నేతలు

బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నేడు తన మేనల్లుడు హరీశ్ రావు నివాసానికి వెళ్లారు. హరీశ్ రావు తండ్రి దివంగత సత్యనారాయణరావు ప్రథమ వర్ధంతి (సంవత్సరీకం) సందర్భంగా ఆయనకు నివాళులర్పించారు. రంగారెడ్డి జిల్లా నార్సింగి సర్కిల్ పరిధిలోని కోకాపేటలో ఉన్న హరీశ్ రావు స్వగృహానికి కేసీఆర్ చేరుకున్నారు. అక్కడ ఏర్పాటు చేసిన సత్యనారాయణరావు చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. అనంతరం హరీశ్ రావుతో పాటు ఆయన కుటుంబ సభ్యులను కేసీఆర్ పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కూడా పాల్గొన్నారు. ఆయన దివంగత సత్యనారాయణరావు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి శ్రద్ధాంజలి అర్పించారు. వీరితో పాటు రాజ్యసభ

(మిగతా 2వ పేజీలో..)



రాప్తాడు విద్యార్థినికి ప్లాస్టిక్ సర్జరీ విజయవంతం: లోకేశ్

- బాలికను త్వరలో ఐసీయూ నుంచి జనరల్ వార్డుకు తరలించనున్న వైద్యులు
- ఆమె ఆరోగ్యంపై వివరాలు వెల్లడించిన మంత్రి లోకేశ్
- బాధితురాలి వైద్య ఖర్చులను పూర్తిగా భరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

రాప్తాడు విద్యార్థినికి నిర్వహించిన మరో ప్లాస్టిక్ సర్జరీ విజయవంతమైందని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారు. శనివారం సాయంత్రం ఆయన 'ఎక్స్' వేదికగా ఈ వివరాలను వెల్లడించారు. బాలికకు కుట్లు తీసివేసి, గాయాన్ని శుభ్రపరిచి తిరిగి కుట్లు వేసే



(మిగతా 2వ పేజీలో..)

సోనియా పుస్తకావిష్కరణకు ఢిల్లీకి సీఎం విజయ్.. ప్రధానితో భేటీపై ఉత్కంఠ!

- సోనియా గాంధీ పుస్తకావిష్కరణకు ఢిల్లీకి సీఎం విజయ్
- గాంధీ కుటుంబం నుంచి వ్యక్తిగతంగా అందిన ఆహ్వానం
- ప్రధాని మోదీతో భేటీ అయ్యే అవకాశంపై రాజకీయ ఆసక్తి
- మేఘదాతు డ్యాంపై కేంద్రంపై ఒత్తిడి తెచ్చే యత్నం

తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ సోమవారం ఢిల్లీలో పర్యటించనున్నారు. ఏఐసీసీ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ ఆత్మకథ "బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్" పుస్తకావిష్కరణ కార్యక్రమానికి ఆయన విశిష్ట అతిథిగా హాజరుకానున్నారు. ఢిల్లీలోని ఒక ప్రముఖ హోటల్‌లో జరగనున్న ఈ వేడుకలో విజయ్ పాల్గొంటున్నట్లు తమిళనాడు కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మణికం ఠాగూర్ ధ్రువీకరించారు.

(మిగతా 2వ పేజీలో..)



ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

ప్రధాని మోదీతో భేటీ అయిన రేవంత్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

పడిపోయిన తీరును ముఖ్యమంత్రి ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు. జూన్ 1 నుంచి సెప్టెంబర్ 30 వరకు రాష్ట్రంలో సుమారు 17 శాతం లోటు వర్షపాతం నమోదైనట్లు వివరించారు.రాష్ట్రంలోని మొత్తం 33 జిల్లాలకు గాను 31 జిల్లాల్లోని 365 మండలాలను ఇప్పటికే కరువు ప్రాంతాలుగా ప్రకటించిన విషయాన్ని రేవంత్ రెడ్డి ప్రధానికి తెలియజేశారు. ఇందులో 111 మండలాలు తీవ్ర కరవు బారిన పడగా, 254 మండలాలు మధ్యస్థాయి కరవును ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు. వర్షాభావం కారణంగా ఖరీఫ్ సీజన్ సాగు విస్తీర్ణం 139.28 లక్షల ఎకరాల నుంచి 126.06 లక్షల ఎకరాలకు తగ్గిపోయిందని వివరించారు.కరవు సహాయక చర్యలతో పాటు రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న దీర్ఘకాలిక సాగునీటి ప్రాజెక్టులకు అవసరమైన అనుమతులు, నిధుల కేటాయింపులపై కూడా చర్చించారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించ తలపెట్టిన 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్'తో పాటు 'ఖేలో ఇండియా' క్రీడల ప్రారంభోత్సవానికి రావాల్సిందిగా ప్రధాని మోదీని ముఖ్యమంత్రి ఆహ్వానించారు.

హరీశ్ రావు తండ్రి సంవత్సరీకం.. హాజరైన కేసీఆర్, కేటీఆర్

మాజీ సభ్యుడు జోగినపల్లి సంతోష్ కుమార్, మాజీ కార్పొరేషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ తదితర ముఖ్య నేతలు హాజరై హరీశ్ రావు కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.


రాప్తాడు విద్యార్థినికి ప్లాస్టిక్ సర్జరీ విజయవంతం: లోకేశ్

(మొదటి పేజీ తరువాయి)

ప్రక్రియ (డీబ్రిడ్‌మెంట్, రీ-స్యూచరింగ్) పూర్తయిందని పేర్కొన్నారు. ఆమెను త్వరలోనే ఐసీయూ నుంచి జనరల్ వార్డుకు తరలించనున్నట్లు వివరించారు. కొన్ని రోజులుగా ఆమె వెంటిలేటర్ సాయం లేకుండానే శ్వాస తీసుకుంటోందని, ప్రస్తుతం ద్రవ ఆహారం కూడా ఇస్తున్నారని మంత్రి లోకేశ్ తెలిపారు. తాజాగా శనివారం నిర్వహించిన సర్జరీతో ఆమె కోలుకోవడంలో మరో ముందడుగు పడినట్లయింది. బాధితురాలి వైద్య ఖర్చులన్నింటినీ రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తోంది.

ఇమ్రాన్‌తో 2021లో భేటీ కావాలనుకొన్న మోదీ!

న్యూఢిల్లీ : భారత ప్రధాని నరేంద్ర మోదీ 2021 ఏప్రిల్‌లో పాకిస్థాన్ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌తో భేటీ కావాలని అనుకున్నారని అంతర్జాతీయ వ్యూహాత్మక అధ్యయనాల సంస్థ (ఐఐఎస్ఎస్) విడుదల చేసిన తాజా పరిశోధన పత్రం తెలిపింది. బలూచిస్థాన్‌లో ఉన్న హింగ్లాజ్ మాత ఆలయాన్ని(శక్తిపీఠంగా భావించే గుడి) దర్శించాక ఇమ్రాన్ తో మోదీ సమావేశం కావాలనుకొన్నారని వెల్లడించింది. భారత్-పాకిస్థాన్ సంబంధాలను మెరుగుపరిచేందుకు తెర వెనుక జరిగిన దౌత్య ప్రయత్నాల్లో భాగంగానే ఈ ప్రతిపాదన వచ్చిందని 'భారత్-పాకిస్థాన్ మధ్య తెర వెనుక చర్చల పరిస్థితి' పేరుతో వెలువడిన ఈ పత్రం పేర్కొన్నది.




నా దగ్గర డబ్బుల్లేవ్.. నా మెట్రో టికెట్‌ను కూడా మోదీనే కొన్నారు: డీకే శివకుమార్

ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో తనకున్న అనుబంధం గురించి, ఇటీవల మెట్రో ప్రయాణంలో జరిగిన ఓ సరదా సంభాషణ గురించి కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. నవంబర్ 13న పింక్ లైన్ మెట్రో ప్రారంభోత్సవం సందర్భంగా ప్రధానితో కలిసి ప్రయాణించినప్పుడు, తన దగ్గర టికెట్ కొనడానికి డబ్బులు లేవని, తన టికెట్ కూడా కొనమని ప్రధానిని కోరానని ఆయన తెలిపారు. "మెట్రో టికెట్ కొనడానికి నా దగ్గర డబ్బులు లేవని నేను ఆయనతో చెప్పాను. నా టికెట్ కూడా కొనమని అడిగాను. వెంటనే ప్రధాని మోదీ తన సొంత కార్డు ఉపయోగించి టికెట్లు కొన్నారు" అని శివకుమార్ నవ్వుతూ చెప్పారు. ప్రధానితో హెలికాప్టర్‌లో మైసూరు వెళ్లినప్పుడు ఏం చర్చించారని మీడియా ప్రశ్నించగా "మేము చర్చించుకున్న ప్రతీ విషయాన్ని బయటపెట్టలేను" అని ఆయన సమాధానమిచ్చారు. బీజేపీ నేతలకు కూడా దొరకని సమయం మీకు మోదీతో దొరుకుతోందన్న ప్రశ్నకు, అది మానవ సంబంధాలు, పరస్పర గౌరవంపై ఆధారపడి ఉంటుందని అన్నారు. "మా పార్టీ నేతలు రాహుల్ గాంధీ, సోనియా గాంధీ, మల్లికార్జున ఖర్గే కూడా నన్ను ప్రేమగా, గౌరవంగా చూస్తారు. అందరితో మంచి సంబంధాలు కొనసాగించాలి" అని ఆయన పేర్కొన్నారు.

స్థానిక వనరులకే ప్రాధాన్యం

ఈ సందర్భంగా మెట్రో అధికారులకు ఇచ్చిన కీలక ఆదేశాల గురించి శివకుమార్ వివరించారు. మెట్రో స్టేషన్ల నిర్మాణంలో ఇతర రాష్ట్రాల నుంచి కాకుండా కర్ణాటకలో లభించే గ్రానైట్, ఇతర రాళ్లను మాత్రమే వినియోగించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశానని తెలిపారు. "మన రాష్ట్రంలోనే నాణ్యమైన రాళ్లు అందుబాటులో ఉన్నప్పుడు, బయటి నుంచి ఎందుకు తీసుకురావాలి? స్థానిక రాళ్లను వాడితే మన పరిశ్రమలకు చేయూతనిచ్చినట్లు అవుతుంది. కటింగ్ నుంచి ప్రాసెసింగ్ వరకు స్థానికులకు ఉపాధి లభిస్తుంది" అని ఆయన అన్నారు. చామరాజనగర్, తుమకూరు, సిరా, బాదామి, ఇల్కల్ వంటి ప్రాంతాల్లో నాణ్యమైన గ్రానైట్ లభిస్తుందని, మన రాళ్ల నాణ్యతలో ఎలాంటి తేడా లేదని ఆయన స్పష్టం చేశారు.పిల్లలు మొబైల్ ఫోన్ల వాడకం తగ్గించి చదువుపై ఎక్కువ దృష్టి పెట్టాలని శివకుమార్ సూచించారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కోసం ప్రైవేట్ విద్యాసంస్థలు వాటిని దత్తత తీసుకోవాలని పిలుపునిచ్చినట్లు తెలిపారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ నిధులను ప్రభుత్వ పాఠశాలలకు మళ్లించడంపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో చర్చించినట్లు చెప్పారు. అయితే, పాఠశాలల నియంత్రణ మాత్రం ప్రభుత్వం చేతిలోనే ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ప్రధాని మోదీపై రాహుల్ గాంధీ చేసిన ఫోన్ ట్యాపింగ్ ఆరోపణల గురించి ప్రశ్నించగా, తాను ఇంకా సమాచారం సేకరిస్తున్నానని, పూర్తి వివరాలు తెలిశాక మాట్లాడతానని శివకుమార్ తెలిపారు.



రాహుల్ గాంధీకి సీఎం బాడీగార్డ్‌లా వ్యవహరిస్తున్నారు: కేటీఆర్ విమర్శలు

(మొదటి పేజీ తరువాయి)

ఒక బాడీగార్డులా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. పీసీసీ అధ్యక్షుడు, మంత్రులు సైతం రాహుల్ గాంధీ నడుపుతున్న బైక్ వెనుక నౌకర్ల మాదిరిగా పరుగులు తీస్తున్నారని ఎద్దేవా చేశారు. శనివారం నాడు గిగ్ వర్కర్లతో కలిసి రాహుల్ గాంధీ నిర్వహించిన బైక్ ర్యాలీ దృశ్యాలను ప్రస్తావిస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.ఇదే సమయంలో బీజేపీ రాష్ట్ర నాయకత్వాన్ని కూడా కేటీఆర్ తప్పుపట్టారు. కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు గతంలో అమిత్ షా కాళ్లకు మొక్కడం, ఆయన చెప్పులు మోయడం వంటి చర్యలను గుర్తుచేస్తూ, ఇది అత్యంత సిగ్గుచేటైన, అనుచితమైన ప్రవర్తన అని విమర్శించారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని ఈ రెండు జాతీయ పార్టీలు ఏనాడూ గౌరవించలేవని ఆయన స్పష్టం చేశారు. కాగా, రాహుల్ గాంధీ బైక్ వెనుక తాను పరిగెత్తడంపై టీపీసీసీ అధ్యక్షుడు బి. మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టత ఇచ్చారు. తాను కూడా బైక్‌పైనే వెళుతున్న క్రమంలో వాహనం స్కిడ్ అయ్యిందని, రాహుల్ గాంధీ తనను గమనించి పక్కకు పిలిచారని తెలిపారు. తాను శారీరకంగా ఫిట్‌గా ఉన్నందునే పక్కనే పరిగెత్తుకుంటూ వెళ్లానని, రాహుల్ గాంధీ వెంట అలా పరిగెత్తడం తన అదృష్టంగా భావిస్తున్నానని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. మరోవైపు, అధికారిక ప్రభుత్వ కార్యక్రమాల్లో రాహుల్ గాంధీ పాల్గొనడంపై బీఆర్ఎస్ పార్టీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. చేతిలో రాజ్యాంగాన్ని పట్టుకుని నీతులు చెబితే సరిపోదని, ముందుగా రాజ్యాంగ విలువలను గౌరవించడం నేర్చుకోవాలని హితవు పలికింది. ఏ హోదాలో, ఏ ప్రొటోకాల్ ప్రకారం రాష్ట్ర ప్రభుత్వ పథకాలను ప్రారంభిస్తున్నారని ప్రశ్నించింది. రాహుల్ గాంధీ శనివారం గిగ్ వర్కర్ల సంక్షేమ ప్యాకేజీని ప్రకటించడంతో పాటు, రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన 'భారత్ సమ్మిట్' ముగింపు సభలో ప్రసంగించిన నేపథ్యంలో బీఆర్ఎస్ ఈ ప్రశ్నలను సంధించింది.

సోనియా పుస్తకావిష్కరణకు ఢిల్లీకి సీఎం విజయ్.. ప్రధానితో భేటీపై ఉత్కంఠ!

(మొదటి పేజీ తరువాయి)


ఈ కార్యక్రమానికి సోనియా గాంధీ కుటుంబ సభ్యులతో పాటు పలువురు ముఖ్య ఆహ్వానితులు హాజరుకానున్నారు. సోనియా గాంధీతో పాటు రాహుల్ గాంధీ కూడా ముఖ్యమంత్రి విజయ్‌కు ఫోన్ చేసి వ్యక్తిగతంగా ఆహ్వానించినట్లు కాంగ్రెస్ వర్గాలు వెల్లడించాయి. ఈ నేపథ్యంలో విజయ్ ఢిల్లీ పర్యటనకు రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది.పుస్తకావిష్కరణ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం అయినప్పటికీ, ఈ పర్యటనలో ముఖ్యమంత్రి విజయ్ ప్రధాని నరేంద్ర మోదీతో సమావేశమవుతారా లేదా అనే అంశంపై ఉత్కంఠ నెలకొంది. ఒకవేళ భేటీ జరిగితే, కావేరి నదిపై కర్ణాటక ప్రభుత్వం ప్రతిపాదించిన మేఘధాతు డ్యాం నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ తమిళనాడు వాదనలను ఆయన మరోసారి వినిపించే అవకాశం ఉంది. ఈ ప్రాజెక్టుకు కేంద్రం ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతులు మంజూరు చేయవద్దని కోరుతూ నవంబర్ 7న విజయ్ ఇప్పటికే ప్రధానికి లేఖ రాశారు. ఈ ప్రాజెక్టు విషయంలో సుప్రీంకోర్టు తీర్పు తమకు అనుకూలంగా ఉందంటూ కర్ణాటక సీఎం డీకే శివకుమార్ ఇటీవల చేసిన వ్యాఖ్యలతో ఈ వివాదం మరింత ముదిరింది. ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత విజయ్ ఢిల్లీకి వెళ్లడం ఇది మూడోసారి. గత పర్యటనల్లో ఆయన ప్రధాని మోదీ, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, సోనియా గాంధీ వంటి అగ్రనేతలతో భేటీ అయ్యారు.

పేదల గుమ్మాల వద్దకే సంక్షేమ ఫలాలు

మంత్రి పొంగులేటి

ఖమ్మం రూరల్/ తిరుమలాయపాలెం, నవంబరు 15

: పేదల సంక్షేమం, అభివృద్ధి కోసం చేపడుతున్న పథకాల ఫలాలను వారి గుమ్మాల వద్దకు చేర్చడమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఖమ్మం జిల్లా ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో, అలాగే తిరుమలాయపాలెం మండలంలోని బీరోలు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కలెక్టర్ దివాకరతో కలిసి నూతన చేయూత పింఛన్ మంజూరు పత్రాలను ఆయన లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సమావేశాల్లో మంత్రి మాట్లాడుతూ.. దేశంలో ఏ ప్రభుత్వం చేపట్టని విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక హైదరాబాద్‌తో కలిపి 8లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామన్నారు.రూ.45వేల కోట్లతో పేదింటి ఆడబిడ్డల కోసం ఇళ్ల నిర్మాణం చేపట్టామన్నారు. ఇందిరమ్మ ఇళ్ల బిల్లులను నేరుగా లబ్ధిదారుల ఖాతాలో జమ చేస్తున్నామన్నారు. ప్రజల మనసెరిగి వారికి ఉపయోగపడే పనులు చేయనప్పుడు ఏ ప్రభుత్వం గొప్పలు చెప్పుకున్నా లాభం లేదని గత సర్కారు అలాంటిదేనని విమర్శించారు. ఒంటరి మహిళలు, వికలాంగులు, దీర్ఘకాలిక జబ్బులతో బాధపడేవారు, వృత్తులను నమ్ముకుని అవయవాలు కోల్పోయిన వారందరినీ నాటి ప్రభుత్వం విస్మరించిందన్నారు. అందుకే తమ సర్కారు దీపావళి నాడు 4.5 లక్షల మందికి ఒకేసారి పింఛన్లు అందిస్తామని చెప్పి మాట నిలబెట్టుకుందన్నారు. పేదవాడి ఆత్మగౌరవానికి భంగం కలగకుండా ఇళ్లు ఇవ్వాలనే జ్ఞానం ఆనాడు పదేళ్ల పాలకులకు లేకపోయిందన్నారు. రైతు రాజు కావాలనే ఉద్దేశంతో రూ.2 లక్షల రుణమాఫీ, ఎకరానికి రూ.12 వేలు రైతు భరోసా, సన్న వడ్లు వేసిన రైతన్నకు క్వింటాలుకు మద్దతు ధరతో పాటు రూ.500 బోనస్ ఇస్తున్నామని తెలిపారు. ఇప్పటికే 72 వేల ఉద్యోగాలు ఇచ్చి.. మళ్లీ 14వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇచ్చిన ఘనత ఈ ప్రభుత్వానిదేనన్నారు. బీఆర్ఎస్ హయాంలో కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో రూ.వేల కోట్లు ఖర్చు పెట్టారని పొంగులేటి విమర్శించారు.



మురసు తుపానుతో ఏపీకి రూ.2,484 కోట్ల నష్టం.. కేంద్ర బృందానికి వివరించిన చంద్రబాబు

కేంద్ర బృందంతో వర్చువల్‌గా సమావేశమైన సీఎం చంద్రబాబు
రాష్ట్రానికి తక్షణ తుపాను సాయం అందించాలని విజ్ఞప్తి
నాలుగు జిల్లాల్లోని 60 ప్రాంతాల్లో పర్యటించిన కేంద్ర బృందం
క్షేత్రస్థాయిలో నష్టం తీవ్రంగా ఉందని తెలిపిన కేంద్ర అధికారులు

మురసు తుపాను కారణంగా తీవ్రంగా నష్టపోయిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తక్షణమే ఆర్థిక సాయం అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్రాన్ని కోరారు. రాష్ట్రంలో తుపాను నష్టాన్ని అంచనా వేసేందుకు వచ్చిన కేంద్ర అంతర్ మంత్రిత్వ శాఖల బృందంతో ఆదివారం ఆయన వర్చువల్ విధానంలో సమీక్ష నిర్వహించారు. కేంద్ర హోంశాఖ సంయుక్త కార్యదర్శి చిత్తరంజన్ దాస్ నేతృత్వంలోని ఏడుగురు సభ్యుల బృందం తాము క్షేత్రస్థాయిలో పరిశీలించిన అంశాలను ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి వివరించింది.వరుస తుపాన్లు, ఎల్ నినో ప్రభావం వల్ల రైతాంగంతో పాటు పలు కీలక రంగాలు తీవ్రంగా దెబ్బతిన్నాయని సీఎం చంద్రబాబు కేంద్ర బృందానికి తెలిపారు. తీర ప్రాంతంలో భవిష్యత్తులో తుపాన్లను తట్టుకునేలా మౌలిక సదుపాయాలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని, ఇందుకు కేంద్ర ప్రభుత్వం తగిన ఆర్థిక సహకారం అందించాలని కోరారు. క్షేత్రస్థాయి పరిస్థితులపై కేంద్ర ప్రభుత్వానికి త్వరగా సమగ్ర నివేదిక సమర్పించి, తక్షణ సాయం అందేలా చూడాలని సూచించారు.రాష్ట్రంలో పర్యటించిన కేంద్ర బృందం పలు కీలక అంశాలను ముఖ్యమంత్రి వద్ద ప్రస్తావించింది. ఆకస్మిక వరదల కారణంగా ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, విద్యుత్ స్తంభాలు భారీగా దెబ్బతిన్నాయని తెలిపింది. అయితే, ప్రభుత్వం ముందస్తుగా కాలువలు, వాగుల్లో పూడికతీత పనులు చేపట్టడం వల్ల నష్టం తీవ్రత చాలావరకు తగ్గిందని పేర్కొంది. అర్నబ్ తుపానుతో పోలిస్తే మురసు తీవ్రత వల్ల తూర్పుగోదావరి జిల్లాలో 80 శాతం, ఏలూరు జిల్లాలో 90 శాతం వరకు వరి పంట దెబ్బతిన్నట్లు తెలిపింది. మామిడి, బొప్పాయి వంటి ఉద్యాన పంటలకు భారీ నష్టం వాటిల్లిందని వివరించింది. పత్తి రైతులకు బీమా ప్రీమియం ఎక్కువగా ఉండటం వల్ల చాలామంది బీమా చేసుకోలేకపోయారని, ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు అధిక పరిహారం ఇచ్చేలా చూడాలని సూచించింది. బాధితులకు నెల రోజుల్లో మూడుసార్లు రేషన్ పంపిణీ, పాఠశాల విద్యార్థులకు యూనిఫాంలు, గిరిజనులకు ప్రత్యేక సాయం అందించే అంశాలను ప్రభుత్వం పరిశీలించాలని పేర్కొంది.చిత్తరంజన్ దాస్ నేతృత్వంలోని బృందం రెండుగా విడిపోయి బాపట్ల, పల్నాడు, ఏలూరు, తూర్పుగోదావరి జిల్లాల్లోని సుమారు 60 ప్రాంతాల్లో క్షేత్రస్థాయి పర్యటన చేసింది. చీరాల, బాపట్ల, పర్చూరు, చిలకలూరిపేట, సూరప్పగూడెం, నిడమర్రు తదితర ప్రాంతాల్లో పంట పొలాలు, కాలువలు, రోడ్లు, విద్యుత్ వ్యవస్థ, మత్స్యకారుల బోట్ల నష్టాన్ని నేరుగా పరిశీలించి బాధిత రైతులతో మాట్లాడింది.రాష్ట్ర ప్రభుత్వ ప్రాథమిక అంచనాల ప్రకారం మురసు తుపాను వల్ల రాష్ట్రంలో రూ.2,484 కోట్ల మేర ఆస్తి, పంట నష్టం జరిగింది. ఇందులో 1,385 కిలోమీటర్ల మేర రోడ్లు దెబ్బతినడంతో రూ.888 కోట్ల నష్టం వాటిల్లింది. వ్యవసాయ రంగంలో 1,43,617 హెక్టార్లలో పంటలు పాడైపోయి, 1,86,063 మంది రైతులకు రూ.875 కోట్ల మేర నష్టం సంభవించింది. ఉద్యాన రంగంలో 6,756 హెక్టార్లలో పంటలు దెబ్బతిని రూ.337 కోట్ల నష్టం వాటిల్లింది. విద్యుత్ రంగంలో 10,192 హెచ్‌టీ (11 కేవీ) స్తంభాలు, 6,442 ఎల్‌టీ స్తంభాలు, 1,448 ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 3,859 ఇళ్లు ధ్వంసమయ్యాయి. సహాయక చర్యల కోసం ఇప్పటికే రూ.37 కోట్లు ఖర్చు చేసినట్లు ప్రభుత్వం కేంద్ర బృందానికి సమర్పించిన నివేదికలో స్పష్టం చేసింది.



ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

మద్దిరాలలో పోలీస్ కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్





అనుమతి పత్రాలు లేని వాహనాలు సీజ్.. 80 మంది పోలీసులతో తనిఖీలు

ప్రజల భద్రతే లక్ష్యం.. నేరాల నియంత్రణకు ప్రజలు సహకరించాలి: డీఎస్పీ ప్రసన్న కుమార్

మద్దిరాల, నవంబర్ 15 (ప్రజానేస్తం జ్వాల):

ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ శాంతిభద్రతల పరిరక్షణకు పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తోందని సూర్యాపేట డివిజన్ డీఎస్పీ ప్రసన్న కుమార్ అన్నారు. శనివారం రాత్రి సూర్యాపేట జిల్లా మద్దిరాల గ్రామంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు.ఈ తనిఖీల్లో డీఎస్పీ ప్రసన్న కుమార్‌తో పాటు సీఐలు ఉపేందర్ రావు, నాగేశ్వరరావు, సర్కిల్ ఎస్సైలు నాగరాజు, క్రాంతికుమార్, వీరన్నతో పాటు మొత్తం 80 మంది పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.ఆపరేషన్‌లో భాగంగా గ్రామంలోకి వచ్చే, వెళ్లే అన్ని మార్గాలను పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకుని విస్తృత తనిఖీలు చేపట్టారు. గ్రామంలోని ఇళ్లను తనిఖీ చేయడంతో పాటు భద్రతాపరమైన అంశాలను పరిశీలించారు. అనుమానిత వ్యక్తుల వివరాలను సేకరించి, ఫింగర్ ప్రింట్ డివైస్ ద్వారా వేలిముద్రలను పరిశీలించారు. సరైన అనుమతి పత్రాలు లేని ద్విచక్ర వాహనాలు, కార్లను స్వాధీనం చేసుకున్నారు.ఈ సందర్భంగా డీఎస్పీ ప్రసన్న కుమార్ గ్రామస్థులతో మాట్లాడి నేరాల నియంత్రణ, సామాజిక భద్రత, రహదారి భద్రత తదితర అంశాలపై అవగాహన కల్పించారు. వాహనాలకు సరైన ధ్రువీకరణ పత్రాలు, నంబర్ ప్లేట్లు తప్పనిసరిగా ఉండాలని సూచించారు. వీటి కొరత వల్ల ప్రమాదాలు, నేరాలు జరిగినప్పుడు వాహనాలను గుర్తించడం, దర్యాప్తు చేయడం కష్టతరమవుతుందని తెలిపారు.నేరాల నివారణలో ప్రజలు కూడా పోలీసులతో భాగస్వాములు కావాలని, గ్రామాల్లో విస్తృతంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. గ్రామానికి కొత్తగా వచ్చే వ్యక్తులకు సంబంధించిన వివరాలపై అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు లేదా 112 అత్యవసర నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, మాదకద్రవ్యాల ప్రభావం గ్రామాల్లోకి ప్రవేశించకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని అన్నారు. భావితరాల భవిష్యత్తును కాపాడుకోవడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. అలాగే రోడ్డు ప్రమాదాల కారణంగా ఎన్నో కుటుంబాలు ఇబ్బందులకు గురవుతున్నాయని, వాహనదారులు ప్రయాణ సమయంలో ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సైబర్ నేరాల పట్ల కూడా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అధిక లాభాల ఆశతో అపరిచిత వ్యక్తులకు వ్యక్తిగత వివరాలు, బ్యాంకు ఖాతా సమాచారం, ఓటీపీలు వెల్లడించవద్దని హెచ్చరించారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని, ఆధునిక పోలీసింగ్ విధానాలతో ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ సేవలందిస్తామని డీఎస్పీ ప్రసన్న కుమార్ తెలిపారు.

వరంగల్ కోటలో సర్వాయి పాపన్న స్మారక శిల్పం గుర్తింపు



హనుమకొండ, నవంబర్ 15 (ప్రజానేస్తం జ్వాల):

చారిత్రక వరంగల్ కోటలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్‌కు సంబంధించినదిగా భావిస్తున్న అరుదైన స్మారక శిల్పాన్ని కొత్త తెలంగాణ చరిత్ర బృందం గుర్తించింది. వరంగల్ పడమర కోట పశ్చిమ ద్వారం వద్ద ఉన్న ఈ శిల్పాన్ని బృందం అధ్యక్షుడు శ్రీరామోజు హరగోపాల్ పరిశోధించి సర్వాయి పాపన్న స్మారక శిల్పంగా గుర్తించినట్లు వెల్లడించారు.శిల్పంలో వీరుడి కుడిచేతిలో కైజారు, ఎడమచేతిలో మస్కట్ తుపాకీ, నడుముకు కత్తి ఉండటం విశేషం. 17వ శతాబ్దానికి చెందినదిగా భావిస్తున్న ఈ శిల్పాన్ని స్థానికులు ఇంతకాలం దేవతా విగ్రహంగా భావిస్తూ పూజలు నిర్వహిస్తున్నారు. చారిత్రక ఆధారాల ప్రకారం 1708లో సర్వాయి పాపన్న వరంగల్ కోటపై దాడి చేసిన ఘటనకు గుర్తుగా ఈ స్మారక శిల్పాన్ని ఏర్పాటు చేసినట్లు హరగోపాల్ వెల్లడించారు. ఈ గుర్తింపుతో తెలంగాణ చరిత్రలోని మరో ముఖ్యమైన ఘట్టానికి సంబంధించిన ఆధారం వెలుగులోకి వచ్చినట్లయిందని చరిత్ర పరిశోధకులు అభిప్రాయపడుతున్నారు.

కేయూ ఆర్థిక వ్యవహారాల్లో ఆడిటర్ ఫీజు వివాదం



హనుమకొండ, నవంబర్ 15 (ప్రజానేస్తం జ్వాల):

కాకతీయ విశ్వవిద్యాలయం ఆర్థిక వ్యవహారాలు, ఆడిటర్ ఫీజు చెల్లింపుల అంశం చర్చనీయాంశంగా మారింది. 2015-16 నుంచి 2020-21 వరకు ఆరేళ్ల కాలానికి సంబంధించి ఆదాయపు పన్ను శాఖ యూనివర్సిటీకి రూ.375.82 కోట్ల పన్ను డిమాండ్ నోటీసులు జారీ చేసింది. ఈ వ్యవహారంపై యూనివర్సిటీ తరఫున చేపట్టిన న్యాయపోరాటం అనంతరం 2026 మార్చిలో అప్పీలేట్ ట్రిబ్యునల్ పన్ను డిమాండ్‌ను రద్దు చేస్తూ తీర్పు ఇచ్చింది.అయితే, ఈ కేసులో యూనివర్సిటీ తరఫున సేవలందించిన ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఆడిటర్‌కు చెల్లించాల్సిన రూ.75 లక్షల ఫీజు ఇప్పుడు వివాదానికి కారణమైంది. ఆడిటర్ ఫీజు చెల్లింపులకు సంబంధించి న్యాయస్థానంలో కేసులు నమోదైనట్లు సమాచారం. ఈ పరిణామాలతో యూనివర్సిటీ ఆర్థిక వ్యవహారాల నిర్వహణ, ఫీజు చెల్లింపుల విధానం, ఉన్నతాధికారుల జవాబుదారీతనంపై విద్యార్థులు, విద్యావేత్తలు ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. పన్ను డిమాండ్ రద్దు అయినప్పటికీ ఆడిటర్ ఫీజు చెల్లింపుల వివాదం కొనసాగుతుండటంతో ఈ వ్యవహారంపై యూనివర్సిటీ అధికారులు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

హనుమకొండలో రేపు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

హనుమకొండ, నవంబర్ 15 (ప్రజానేస్తం జ్వాల):

విద్యుత్ లైన్ల మరమ్మతులు, అభివృద్ధి పనుల నేపథ్యంలో సోమవారం హనుమకొండ నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డీఈఈ సాంబారెడ్డి తెలిపారు.ఉదయం 9:30 గంటల నుంచి 11:30 గంటల వరకు భవానీనగర్, సెయింట్ పీటర్స్ స్కూల్ ప్రాంతం, కళ్యాణి ఫంక్షన్ హాల్ వెనుక ప్రాంతం, హౌసింగ్ బోర్డు, కేఎల్ఎన్ రెడ్డి కాలనీలలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు.అదేవిధంగా డ్రీమ్‌ల్యాండ్ ఫంక్షన్ హాల్, న్యూ రాయపుర ప్రాంతాల్లో ఉదయం 9:30 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు. వినియోగదారులు ఈ విషయాన్ని ముందుగానే గమనించి విద్యుత్ శాఖ సిబ్బందికి సహకరించాలని డీఈఈ కోరారు.





విజయం

నీ విజయమే సమాధానం కావాలి నిన్ను తక్కువగా చూసిన ప్రతి చూపుకీ...

నీ విజయమే ధంకా మోగించాలి నిన్ను అవమానించిన ప్రతి చెవిలోనూ...

నీ అడుగులు ఆగకూడదు నీ గమ్యం దూరమైనా వెనక్కి తగ్గకూడదు నీ విజయపరంపర చూసి విమర్శించిన వారి అహంకారం తలవంచాలి!

నువ్వు నిలిచిన చోట ఓటమి కూడా ఓ పాఠం నేర్చుకోవాలి నువ్వు నడిచిన బాటలో అవమానాలు సైతం పూలవాన కురిపించాలి.

నీ ఎదుగుదల చూసి వాడి గుండెల్లో అసూయ అగ్నిపర్వతమై పేలాలి నిన్ను చూసి నవ్విన పెదవులే నీ విజయానికి చప్పట్లు కొట్టాలి!

గుర్తుంచుకో...

కక్షతో కాదు నీ విజయం కసితో కూడిన కృషితో సాధించాలి ఎదుటివాడిని కూల్చడం కాదు నువ్వెంత ఎత్తుకు ఎదగగలవో చూపించాలి!

ఎందుకంటే... నీ విజయమే నీ సమాధానం నీ ఎదుగుదలే నీ ప్రత్యర్థికి గుణపాఠం!

నాగిల్ల రజినీకాంత్..

ఎమ్మెల్యే రేవూరి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నాయకులు


హనుమకొండ, నవంబర్ 15 (ప్రజానేస్తం జ్వాల):



దామెర మండలం పులుకుర్తి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు, తెలంగాణ ఉద్యమకారులు ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. హనుమకొండ భవానీ నగర్‌లోని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన సమక్షంలో కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల గురించి ప్రస్తావించారు. ఆయా కార్యక్రమాల పట్ల ఆకర్షితులై వివిధ పార్టీల నాయకులు కాంగ్రెస్‌లో చేరుతున్నారని ఆయన తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో పాల్గొన్న వారికి తగిన గుర్తింపు, గౌరవం కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. పార్టీలో చేరిన వారికి తగిన ప్రాధాన్యత ఇస్తామని, పార్టీ కార్యకలాపాల్లో సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో బీఆర్ఎస్ మాజీ వార్డు సభ్యులు చెన్న వెంకటేశ్వర్లు, సముద్రాల రాజు, సీనియర్ నాయకులు గుత్తికొండ సురేందర్, దండు రవి, నాగరాజ్, కొత్త నాగరాజ్, గోవిందు రాజు, గుంపలపల్లి రాజు, కందగట్ల శ్రీనివాస్ తదితరులతో పాటు సుమారు 20 మంది ఉన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు శ్రీధర్ రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు దుబాసి రాజేందర్, మన్నెం ప్రకాశ్ రెడ్డి, జిల్లా కమిటీ సభ్యుడు గన్ను వెంకటేశ్వర్లు, గ్రామ కమిటీ అధ్యక్షుడు పేరుక రాజు, మండల ప్రధాన కార్యదర్శి రాంబాబు, గోవిందు మోహన్ తదితరులు పాల్గొన్నారు.

యాసంగిలో ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలి

నడికుడ, నవంబర్ 15 (ప్రజానేస్తం జ్వాల):



రానున్న యాసంగి 2026 సీజన్‌లో ఎల్‌నినో ప్రభావంతో నీటి ఎద్దడి, విద్యుత్ సరఫరా సమస్యలు తలెత్తే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని నడికుడ మండల వ్యవసాయ అధికారి పోరిక జైసింగ్ సూచించారు. నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని వరి సాగును తగ్గించి, తక్కువ నీటితో సాగు చేయగల ఆరుతడి పంటల వైపు మొగ్గు చూపాలని కోరారు.పంటల మార్పిడి విధానాన్ని పాటించడం ద్వారా నీటి వనరులను పొదుపు చేయడంతో పాటు వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. వ్యవసాయ, ఉద్యానవన శాఖల ఆధ్వర్యంలో పంటల మార్పిడిని ప్రోత్సహించేందుకు వివిధ రకాల సబ్సిడీ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు.ఆరుతడి పంటలు సాగు చేసే రైతులకు డ్రిప్, స్ప్రింక్లర్, మల్చింగ్ వంటి సూక్ష్మ నీటిపారుదల పరికరాలతో పాటు వ్యవసాయ అవసరాలకు సంబంధించిన సబ్సిడీ సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.అడవి జంతువుల నుంచి పంటలను రక్షించుకునేందుకు కనీసం 25 ఎకరాలకు తగ్గకుండా రైతులు సమూహంగా ముందుకొచ్చి తమ భూముల చుట్టూ సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేసుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు.సబ్సిడీ విత్తనాలు, డ్రిప్, స్ప్రింక్లర్, మల్చింగ్, సోలార్ ఫెన్సింగ్ తదితర సౌకర్యాలు పొందేందుకు ఆసక్తి ఉన్న రైతులు రాబోయే రెండు రోజుల్లో తమ గ్రామాల వ్యవసాయ విస్తరణ అధికారులను (ఏఈఓ) సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రస్తుతం రబీ పంటలు సాగు చేస్తున్న రైతులు కూడా తమకు అవసరమైన వ్యవసాయ ఇన్‌పుట్స్ వివరాలను నమోదు చేయించుకోవాలని తెలిపారు.నమోదు ప్రక్రియకు గడువు తక్కువగా ఉన్నందున రైతులు ఆలస్యం చేయకుండా సంబంధిత అధికారులను సంప్రదించాలని కోరారు. వాతావరణ పరిస్థితులు, నీటి లభ్యతకు అనుగుణంగా పంటల ఎంపిక, పంటల మార్పిడి చేపట్టాలని మండల వ్యవసాయ అధికారి పోరిక జైసింగ్ సూచించారు.

ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

సూర్యాపేట కలెక్టరేట్‌లో నేడు బాలల ప్రజావాణి

సూర్యాపేట, నవంబర్ 15 (ప్రజానేస్తం జ్వాల):



బాలల హక్కుల వారోత్సవాలను పురస్కరించుకుని నవంబర్ 16న సూర్యాపేట జిల్లా కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా బాలల ప్రజావాణి నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు.మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లోని సాధారణ ప్రజావాణి ప్రాంగణంలో పిల్లల కోసం ప్రత్యేక డెస్క్ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. బాలల హక్కులపై సమాజంలో అవగాహన పెంపొందించడంతో పాటు, పిల్లలు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.ఈ ప్రజావాణిలో ఆరోగ్య సేవలు, వైద్య సదుపాయాలు, పాఠశాలల్లో మౌలిక వసతులు, విద్యా సంబంధిత సమస్యలు, గ్రామాలు, కాలనీల్లో పిల్లలకు అవసరమైన సదుపాయాలు, పాఠశాలలకు రవాణా సౌకర్యం తదితర అంశాలపై ఫిర్యాదులు స్వీకరించనున్నారు.అదేవిధంగా అంగన్‌వాడీ కేంద్రాలు, పౌష్టికాహారం, మధ్యాహ్న భోజనం, బాలల భద్రత, సంరక్షణ, రక్షణకు సంబంధించిన సమస్యలతో పాటు ఇతర అవసరాలపై పిల్లలు నేరుగా అధికారులకు వినతిపత్రాలు అందజేయవచ్చని కలెక్టర్ వివరించారు.

కార్తీక మాసం సందర్భంగా ఘనంగా వనభోజనాలు, అన్నదానం

బూరుగడ్డ, నవంబర్ 15 (ప్రజా నేస్తం జ్వాల):



కార్తీక మాసాన్ని పురస్కరించుకుని బూరుగడ్డ గ్రామంలోని శ్రీ లక్ష్మీనరసింహ వేణుగోపాలస్వామి దేవాలయ ప్రాంగణంలో మంజునాథ గురుస్వామి పీఠం ఆధ్వర్యంలో వనభోజనాలు, అన్నదాన కార్యక్రమాన్ని ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని ఉసిరి చెట్టు కింద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు, వారి కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి హుజూర్‌నగర్ మున్సిపాలిటీ వైస్ చైర్మన్, పలువురు కౌన్సిలర్లు ముఖ్య అతిథులుగా హాజరై భక్తులతో కలిసి వనభోజన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులతో పాటు గురుస్వాములను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. భక్తి, ఆధ్యాత్మికత, సోదరభావం వెల్లివిరిసిన ఈ కార్యక్రమంలో భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. అన్నదాన కార్యక్రమంతో వేడుకలు విజయవంతంగా ముగిశాయి. కార్యక్రమాన్ని సమన్వయంతో నిర్వహించిన మంజునాథ గురుస్వామి పీఠం సభ్యులను పలువురు అభినందించారు.

తిర్యాణిలో 41 క్వింటాళ్ల రేషన్ బియ్యం మాయం?

తిర్యాణి, నవంబర్ 15 (ప్రజానేస్తం జ్వాల):



తిర్యాణి మండలం గిన్నెదారి గ్రామంలోని చౌక ధరల దుకాణంలో 41 క్వింటాళ్ల రేషన్ బియ్యం మాయమైనట్లు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. స్టాక్ వచ్చినప్పటి నుంచి సేల్స్‌మెన్ ఏదో ఒక కారణం చెబుతూ లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేయకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.దుకాణంలో బియ్యం నిల్వలు ఉన్నప్పటికీ పంపిణీ చేయకపోవడంపై గ్రామస్థులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యవహారంపై సంబంధిత అధికారులు విచారణ చేపట్టినట్లు సమాచారం. విచారణలో 41 క్వింటాళ్ల బియ్యం నిల్వలకు సంబంధించి వాస్తవాలు వెలుగులోకి వస్తాయా? బియ్యం పంపిణీలో అక్రమాలు జరిగినట్లు తేలితే బాధ్యులపై ఎలాంటి చర్యలు తీసుకుంటారన్నది చర్చనీయాంశంగా మారింది.అధికారులు సమగ్ర విచారణ జరిపి, రేషన్ బియ్యం పంపిణీలో పారదర్శకత కల్పించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

అప్పన్నపేట వద్ద మృత్యుఘోష.. లారీని ఢీకొన్న బైక్.. భర్త మృతి, భార్య పరిస్థితి విషమం!

గరిడేపల్లి, నవంబర్ 15 (ప్రజానేస్తం జ్వాల):




గరిడేపల్లి మండలం అప్పన్నపేట సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. లారీ, ద్విచక్ర వాహనం ఎదురెదురుగా ఢీకొనడంతో భర్త ప్రాణాలు కోల్పోగా, భార్య తీవ్ర



గాయాలతో మృత్యువుతో పోరాడుతోంది. ఈ ప్రమాదంలో హుజూర్‌నగర్‌కు చెందిన వంట మాస్టర్ షేక్ నజీర్ మృతి చెందగా, ఆయన భార్య హుస్సేన్ బికి తీవ్ర గాయాలయ్యాయి. ఆమె పరిస్థితి విషమంగా ఉండటంతో వెంటనే హుజూర్‌నగర్ ఏరియా ఆసుపత్రికి తరలించారు.కల్లేపల్లి మైసమ్మ వద్ద వంట కార్యక్రమం ముగించుకుని భార్యాభర్తలు బైక్‌పై తిరిగి వస్తుండగా ఈ దుర్ఘటన జరిగినట్లు సమాచారం. ఒకే ప్రమాదంలో భర్త మృతి చెందడం, భార్య ప్రాణాపాయ స్థితిలో ఆసుపత్రిలో ఉండటంతో వారి కుటుంబంలో విషాదం నెలకొంది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు.

గబ్బిలాలపేటలో సీసీ రోడ్డు నిర్మించాలని కాలనీవాసుల వినతి

జవహర్ నగర్, కీసర సర్కిల్, నవంబర్ 15 (ప్రజా నేస్తం జ్వాల):




అంజమ్మ, పద్మ, సుధీన్ కుమార్, మాధవి, భాగ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జవహర్ నగర్ పరిధిలోని గబ్బిలాలపేట కాలనీలో రహదారి సౌకర్యం లేక స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత 25 ఏళ్లుగా కాలనీలో నివాసం ఉంటున్నప్పటికీ ఇప్పటివరకు సరైన రహదారి నిర్మించలేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్రస్తుతం మట్టి రోడ్డుపై రాకపోకలు సాగించాల్సి వస్తోందని, వర్షాకాలంలో రహదారి బురదమయంగా మారి నడిచేందుకు కూడా ఇబ్బందిగా ఉంటోందని తెలిపారు. ఈ క్రమంలో ప్రజలు, వాహనదారులు జారిపడి ప్రమాదాలకు గురవుతున్నారని పేర్కొన్నారు.సమస్యను పరిష్కరించాలని కోరుతూ జవహర్ నగర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు దొంతగాని శాంతి కోటేష్ గౌడ్‌కు కాలనీవాసులు వినతిపత్రం అందజేశారు. 30 అడుగుల ప్రధాన రహదారి నుంచి తమ గల్లీ చివరి వరకు సీసీ రోడ్డు నిర్మించి, దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న సమస్యకు పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేశారు.25 ఏళ్లుగా నివాసం ఉంటున్నా కనీస రహదారి సౌకర్యం లేకపోవడం ఇబ్బందికరంగా ఉందని, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సీసీ రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరారు. ఈ కార్యక్రమంలో ఎం.డి. సలీం, కనకయ్య, జగన్, బాదావత్, సుజిత్, ఎన్. రంగయ్య, ఎన్. సరిత, ఎల్. కనకయ్య, ఎల్. పుష్ప, పురుషోత్తం, యాకయ్య,

డిగ్రీ హాల్‌టికెట్లలో తప్పులకు కళాశాలలదే బాధ్యత: కేయూ పరీక్షల నియంత్రణాధికారి

హనుమకొండ, నవంబర్ 15 (ప్రజానేస్తం జ్వాల):



చేసే సమయంలో చేసిన పొరపాట్ల వల్లే హాల్‌టికెట్లలో తప్పులు చోటుచేసుకున్నాయని, ఈ విషయంలో బాధ్యత ఆయా కళాశాలలదేనని ఆయన పేర్కొన్నారు.

కాకతీయ యూనివర్సిటీ (కేయూ) డిగ్రీ సెమిస్టర్ పరీక్షల హాల్‌టికెట్లలో తప్పులు దొర్లిన అంశంపై 'ప్రజానేస్తం జ్వాల'లో ప్రచురితమైన కథనానికి యూనివర్సిటీ అధికారులు స్పందించారు. హాల్‌టికెట్లలో తప్పులకు ఆయా డిగ్రీ కళాశాలలు నమోదు చేసిన వివరాలే కారణమని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య కట్ల రాజేందర్ స్పష్టం చేశారు.విద్యార్థుల సబ్జెక్టులు, వ్యక్తిగత వివరాలను ఆయా డిగ్రీ కళాశాలలే నామినల్ రోల్స్ (ఎన్‌ఆర్) ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేసి యూనివర్సిటీకి పంపిస్తాయని ఆయన తెలిపారు. కళాశాలలు పంపిన వివరాల ఆధారంగానే యూనివర్సిటీ పరీక్షల విభాగం హాల్‌టికెట్లను జారీ చేస్తుందని వివరించారు. కళాశాలల యాజమాన్యాలు వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు

కలెక్టర్ పేరుతో నకిలీ వాట్సాప్ ఖాతాలు.. డబ్బులు పంపవద్దని హెచ్చరిక

భూపాలపల్లి, నవంబర్ 15 (ప్రజానేస్తం జ్వాల):



జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పేరు, ఫొటోను దుర్వినియోగం చేస్తూ సైబర్ నేరగాళ్లు నకిలీ వాట్సాప్ ఖాతాల ద్వారా డబ్బులు వసూలు చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు వెలుగులోకి వచ్చింది. కలెక్టర్ పేరుతో జిల్లా అధికారులు, సిబ్బందితో పాటు సామాన్య ప్రజలకు సందేశాలు పంపుతూ అత్యవసరంగా నగదు బదిలీ చేయాలని కోరుతున్నట్లు గుర్తించారు. ఈ నేపథ్యంలో ప్రజలు, ప్రభుత్వ అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ రాహుల్ శర్మ సూచించారు.ముఖ్యంగా 97398 11309 నంబర్ నుంచి తన పేరు, ఫొటోను ఉపయోగించి డబ్బులు పంపాలంటూ సందేశాలు వస్తున్నాయని కలెక్టర్ తెలిపారు. ఈ నంబర్‌తో పాటు తన పేరుతో ఇతర అనుమానాస్పద నంబర్ల నుంచి సందేశాలు వచ్చినా స్పందించవద్దని, ఎట్టి పరిస్థితుల్లోనూ నగదు బదిలీ చేయవద్దని హెచ్చరించారు.ఈ వ్యవహారంపై ఇప్పటికే సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు కలెక్టర్ వెల్లడించారు. నకిలీ వాట్సాప్ సందేశాలు వచ్చిన వెంటనే సంబంధిత నంబర్‌ను బ్లాక్ చేసి, పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఆర్థిక అభ్యర్థనలను నమ్మవద్దని, వ్యక్తిగత వివరాలు, బ్యాంకు ఖాతా సమాచారం, ఓటీపీలు వంటి రహస్య సమాచారాన్ని ఎవరికీ వెల్లడించవద్దని ప్రజలు, అధికారులు, సిబ్బందికి విజ్ఞప్తి చేశారు.

ప్రతి ధాన్యపు గింజకు మద్దతు ధర అందించడమే ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే గండ్ర

భూపాలపల్లి, నవంబర్ 15 (ప్రజానేస్తం జ్వాల):



రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యానికి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర అందించడమే ప్రభుత్వ లక్ష్యమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు. ఆదివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలం బుర్రకాయలగూడెం గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకొచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా, సజావుగా నిర్వహించాలని సూచించారు. ముఖ్యంగా ధాన్యం తేమ శాతం పరిశీలన, నాణ్యత ప్రమాణాలు, తూకం విషయంలో నిబంధనలను కచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు. తూకంలో కోతల పేరుతో లేదా ఇతర కారణాలతో రైతుల నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడితే సహించేది లేదని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులను హెచ్చరించారు. దళారులను నమ్మి మోసపోకుండా రైతులందరూ ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలని ఎమ్మెల్యే సూచించారు.

ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా వనభోజనాలు



భీమదేవరపల్లి, నవంబర్ 15 (ప్రజా నేస్తం జ్వాల):

ఆర్యవైశ్యులంతా ఐకమత్యంతో ఉంటూ సంఘం బలోపేతానికి కృషి చేయాలని, పేదలకు సేవ చేయడంలో ముందుం డాలని జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు తోట సురేష్ పిలుపునిచ్చారు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కొమురవెల్లి చంద్రశేఖర్ గుప్తా ఆధ్వర్యంలో ఆదివారం అశోక్ ముఖర్జీ తోటలో వనభోజనాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తోట సురేష్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం సభ్యులు కుటుంబ సమేతంగా పాల్గొని ఉత్సాహంగా గడిపారు. ఆటపాటలు, వివిధ వినోద కార్యక్రమాలతో ఆహ్లాదకరమైన వాతావరణంలో వనభోజనాలను ఆనందంగా జరుపుకున్నారు. ఇలాంటి కార్యక్రమాలు సంఘ సభ్యుల మధ్య స్నేహసంబంధాలను పెంపొందించడంతో పాటు ఐకృతను మరింత బలోపేతం చేస్తాయని పలువురు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య సంఘం సభ్యుడు చికిలం రాజేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు మునీందర్, మండల గౌరవ అధ్యక్షుడు అంచూరి సదానందం, కార్యదర్శులు అంచూరి వెంకటరాజు, బల్లు రమేష్, భూపతి విజయ్, పెద్ది సూర్యప్రకాష్, చొల్లేటి ప్రకాశం తదితరులు పాల్గొన్నారు.

యాసంగిలో పంటల మార్పిడికి వ్యవసాయ శాఖ ప్రోత్సాహం

భీమదేవరపల్లి, నవంబర్ 15 (ప్రజా నేస్తం జ్వాల):

యాసంగి సీజన్‌లో పంటల మార్పిడిని ప్రోత్సహించేందుకు వ్యవసాయ శాఖ చర్యలు చేపడుతోంది. ఎల్‌నినో ప్రభావంతో నీటి లభ్యత తగ్గడంతో పాటు విద్యుత్ సరఫరాలో సమస్యలు తలెత్తే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులు వరి సాగుకు ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటలు, నూనెగింజలు, కూరగాయల సాగుపై దృష్టి సారించాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు. తక్కువ నీటితో, తక్కువ పెట్టుబడితో పంటలు సాగు చేయడంతో పాటు భూసారాన్ని మెరుగుపరచుకోవచ్చని పేర్కొంటున్నారు.ఆరుతడి పంటలు, కూరగాయలు సాగు చేసే రైతులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం సబ్సిడీపై విత్తనాలు, స్ప్రింక్లర్లు, మల్చింగ్ సదుపాయాలు కల్పించనుంది. అలాగే 25 ఎకరాల వరకు రైతులు సమిష్టిగా సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేసుకుంటే రాయితీ అందించనుంది.ఈ పథకాల అమలులో భాగంగా వ్యవసాయ విస్తరణ అధికారులు (ఏఈఓలు) గ్రామాల్లో పర్యటించి పంటల మార్పిడిపై ఆసక్తి ఉన్న రైతుల వివరాలను సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేయనున్నారు. రైతులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని ప్రత్యామ్నాయ పంటల సాగుకు ముందుకు రావాలని వ్యవసాయ శాఖ అధికారులు కోరుతున్నారు.

ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

రైతులు, వ్యవసాయ కార్మికుల హక్కుల పరిరక్షణకు ఐక్యంగా పోరాడాలి: బృందా కారత్

నల్లగొండ, నవంబర్ 15 (ప్రజానేస్తం జ్వాల):

నల్లగొండలోని ఎన్జీ కళాశాల ప్రాంగణం 36వ అఖిల భారత కిసాన్ సభ మహాసభలకు వేదికైంది. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి రైతులు, వ్యవసాయ కార్మికులు, రైతు సంఘాల ప్రతినిధులు, ఎర్రజెండా కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో మాజీ ఎంపీ బృందా కారత్ ప్రసంగిస్తూ రైతులు, వ్యవసాయ కార్మికులు, గ్రామీణ పేదల హక్కుల పరిరక్షణకు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు.తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట చరిత్రను మతతత్వ రాజకీయాలకు ఆపాదించే ప్రయత్నాలను తిప్పికొట్టాలని ఆమె అన్నారు. నిజాం పాలన, భూస్వామ్య దోపిడీ, వెట్టిచాకిరీకి వ్యతిరేకంగా సాగిన తెలంగాణ రైతాంగ పోరాటం చారిత్రకమైనదని పేర్కొన్నారు. ఈ పోరాటం హిందూ, ముస్లింల మధ్య జరిగినది కాదని, భూస్వామ్య దోపిడీకి వ్యతిరేకంగా సాగిన లౌకిక పోరాటమని వివరించారు. దున్నేవాడికే భూమి దక్కాలనే లక్ష్యంతో సాగిన ఉద్యమంలో వేలాది మంది ప్రాణత్యాగం చేశారని గుర్తుచేశారు. దొడ్డి కొమరయ్య, చాకలి ఐలమ్మ, పుచ్చలపల్లి సుందరయ్య, మల్లు స్వరాజ్యం వంటి నాయకుల సేవలను ప్రస్తావించారు.కిసాన్ సభ తొమ్మిది దశాబ్దాలుగా రైతులు, వ్యవసాయ కార్మికులు, గ్రామీణ పేదల హక్కుల కోసం పోరాడుతోందని బృందా కారత్ తెలిపారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా వ్యవసాయ విధానాలు రూపొందిస్తోందని విమర్శించారు. మూడు వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా రైతులు నిర్వహించిన ఉద్యమం కారణంగా కేంద్ర ప్రభుత్వం ఆ చట్టాలను వెనక్కి తీసుకోవాల్సి వచ్చిందని పేర్కొన్నారు.భారత్--అమెరికా వాణిజ్య ఒప్పందం దేశీయ రైతాంగ ప్రయోజనాలకు విఘాతం కలిగించే ప్రమాదం ఉందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. రైతులతో చర్చించకుండా వాణిజ్య ఒప్పందాలపై ముందుకు వెళ్లడం సరికాదని, రైతుల ప్రయోజనాలకు విరుద్ధంగా ఉండే ఒప్పందాలను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్న నేపథ్యంలో రేషన్ దుకాణాల ద్వారా బియ్యం, పప్పులు, నూనెలను సబ్సిడీపై అందించాలని కోరారు.దేశంలో వ్యవసాయ సంక్షోభం తీవ్రంగా ఉందని, రైతుల ఆత్మహత్యలు ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. గత 12 ఏళ్లలో దేశవ్యాప్తంగా లక్షన్నర వ్యవసాయ సంబంధిత ఆత్మహత్యలు నమోదయ్యాయని సభలో వెల్లడించారు. కరువు, వరదలు, పంట నష్టాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులకు పూర్తిస్థాయిలో పరిహారం అందించాలని, పంటల బీమా పథకంలో బీమా కంపెనీల లాభాపేక్షను నియంత్రించాలని అన్నారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల మేరకు పంటలకు కనీస మద్దతు ధర కల్పించాలని, డీజిల్ ధరలను నియంత్రించి వ్యవసాయ పెట్టుబడి భారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు.విద్యుత్ ప్రైవేటీకరణను నిలిపివేయాలని, స్మార్ట్ మీటర్ల పేరుతో రైతులపై అదనపు భారం మోపవద్దని కోరారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని బలోపేతం చేసి గ్రామీణ పేదలు, భూమిలేని కూలీలకు నిరంతర ఉపాధి కల్పించాలని సూచించారు.దేశంలో భూమి పంపిణీలో అసమానతలు కొనసాగుతున్నాయని పేర్కొంటూ భూగరిష్ట పరిమితి చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని, భూమిలేని పేదలకు సాగుభూమి పంపిణీ చేసి సమగ్ర భూసంస్కరణలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అప్పుల భారంతో భూములు కోల్పోతున్న చిన్న, సన్నకారు రైతులను ఆదుకోవాలని కోరారు.వ్యవసాయ పనుల్లో కీలక పాత్ర పోషిస్తున్న మహిళలకు రైతులుగా గుర్తింపు కల్పించాలని బృందా కారత్ అన్నారు. మహిళలను కుటుంబ సహాయకులుగా మాత్రమే చూడకుండా స్వతంత్ర రైతులుగా గుర్తించి, భూమిపై హక్కులు, ప్రభుత్వ పథకాల్లో సమాన ప్రాధాన్యత కల్పించాలని కోరారు.అభివృద్ధి ప్రాజెక్టుల పేరుతో రైతులను నిర్వాసితులను చేయడం సరికాదని, 2013 భూసేకరణ చట్టం ప్రకారం నిర్వాసితులకు న్యాయమైన పరిహారం అందించాలని అన్నారు. ఆదివాసీల జల్, జంగిల్, జమీన్ హక్కులను పరిరక్షించాలని, అటవీ హక్కుల చట్టాన్ని పకడ్బందీగా అమలు చేసి పోడు సాగుదారులకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆదివాసీలను ఆక్రమణదారులుగా పరిగణించి తొలగింపులకు పాల్పడవద్దని, గ్రామసభల అధికారాలను గౌరవించాలని కోరారు.రైతులు, వ్యవసాయ కార్మికులు, గ్రామీణ పేదల సమస్యల పరిష్కారం కోసం సంఘటితంగా ఉద్యమించాలని ఆమె పిలుపునిచ్చారు. కార్పొరేట్ అనుకూల వ్యవసాయ విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఉద్యమాలను బలోపేతం చేయాలని పేర్కొన్నారు.



రాజ్యాంగ పరిరక్షణ కమిటీ అధ్యక్షుడిగా మాచర్ల సదానందం

భీమదేవరపల్లి, నవంబర్ 15 (ప్రజా నేస్తం జ్వాల):



రాజ్యాంగ విలువల పరిరక్షణ, ప్రజల్లో రాజ్యాంగంపై అవగాహన కల్పించడం, హక్కుల సాధన కోసం సంఘటితంగా పనిచేయడం లక్ష్యంగా భీమదేవరపల్లి గ్రామ రాజ్యాంగ పరిరక్షణ కమిటీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఆదివారం పచ్చునూరి కరుణాకర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో కమిటీ గ్రామ అధ్యక్షుడిగా మాచర్ల సదానంద గౌడ్‌ను, ప్రధాన కార్యదర్శిగా సయ్యద్ ఫజల్‌ను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ రాజ్యాంగ పరిరక్షణకు కృషి చేస్తామని, ప్రజలకు రాజ్యాంగం కల్పించిన హక్కులు, బాధ్యతలపై అవగాహన కల్పించేందుకు కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం రాష్ట్ర నాయకుడు చెప్యాల ప్రకాష్, ఉప్పుల కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

పిల్లల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రజావాణి

భీమదేవరపల్లి, నవంబర్ 16 (ప్రజా నేస్తం జ్వాల):

పిల్లల సమస్యల పరిష్కారానికి భీమదేవరపల్లి మండలంలో నిర్వహించే ప్రజావాణిలో ప్రత్యేకంగా బాలల ప్రజావాణి ఏర్పాటు చేయనున్నట్లు ఎంపీడీవో వీరేశం తెలిపారు. సాధారణ ప్రజల సమస్యలు, ఫిర్యాదులతో పాటు పిల్లలకు వివిధ ప్రభుత్వ శాఖల ద్వారా ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ పిల్లలు తమకు ఎదురవుతున్న సమస్యలపై సంబంధిత శాఖల అధికారులకు దరఖాస్తులు అందజేయవచ్చని తెలిపారు. వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. మండలంలోని అన్ని గ్రామాల అధికారులు పిల్లలకు ఈ కార్యక్రమంపై సమాచారం అందించి, బాలల ప్రజావాణిలో వారు పాల్గొనేలా చూడాలని సూచించారు.



జవహర్ నగర్ డివిజన్‌లో కాలనీల సమస్యలను తెలుసుకున్న శాంతి కోటేష్ గౌడ్

జవహర్ నగర్, నవంబర్ 15 (ప్రజా నేస్తం జ్వాల):

జవహర్ నగర్ డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో మాజీ మేయర్, కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షురాలు దొంతగాని శాంతి కోటేష్ గౌడ్ పర్యటించారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, కాలనీవాసులతో కలిసి స్థానికంగా నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాలనీల్లోని సీసీ రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి సరఫరా, వీధి దీపాలు, పారిశుద్ధ్యం తదితర మౌలిక వసతుల సమస్యలపై స్థానికులతో చర్చించారు. ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసుకుని, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ప్రతి కాలనీలో అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామని శాంతి కోటేష్ గౌడ్ తెలిపారు. ప్రజలు తెలిపిన సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రయత్నిస్తామని హామీ ఇచ్చారు.



ప్రైవేట్ కాలేజీలకు 1 నుంచి 12వ తరగతి వరకు నిర్వహణకు అవకాశం

హనుమకొండ, 15 నవంబర్ 2026 (ప్రజానేస్తం జ్వాల):

రాష్ట్రంలో వచ్చే విద్యా సంవత్సరం నుంచి అమలు చేయనున్న నూతన 10+2 విద్యా విధానంపై ఇంటర్మీడియట్ విద్యాశాఖ కార్యదర్శి అఖిలాష స్పష్టత ఇచ్చారు. ఆసక్తి ఉన్న ప్రైవేట్ జూనియర్ కళాశాలల యాజమాన్యాలు ప్రభుత్వ మార్గదర్శకాలు, నిబంధనలకు అనుగుణంగా 1వ తరగతి నుంచి 12వ తరగతి వరకు విద్యాసంస్థలను నిర్వహించుకోవచ్చని వెల్లడించారు. ఇందుకు అవసరమైన అనుమతులను నిబంధనల ప్రకారం మంజూరు చేస్తామని తెలిపారు.ప్రైవేట్ జూనియర్ కళాశాలల యాజమాన్యాలతో నిర్వహించిన సమావేశంలో ఆమె ఈ విషయాలను వివరించారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచే అన్ని తరగతులను తప్పనిసరిగా ప్రారంభించాలనే నిబంధన ఏమీ లేదని స్పష్టం చేశారు. ఆయా విద్యాసంస్థల ఆసక్తి, సన్నద్ధత ఆధారంగా నిర్ణయం తీసుకోవచ్చని పేర్కొన్నారు. విద్యార్థుల విద్యా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పాఠశాల విద్యా వ్యవస్థలో ఇంటర్మీడియట్ విద్యను విలీనం చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు కార్యదర్శి వివరించారు. నూతన విద్యా విధానం అమలులో భాగంగా ప్రభుత్వ మార్గదర్శకాలను పాటిస్తూ విద్యాసంస్థలు ముందుకు వెళ్లవచ్చని సూచించారు.



అయోధ్య--జనక్‌పూర్ మధ్య కొత్త వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలు

హనుమకొండ, 15 నవంబర్ 2026 (ప్రజానేస్తం జ్వాల):

ఆధ్యాత్మిక పర్యాటకులకు భారతీయ రైల్వే కొత్త రైలు సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకురానుంది. శ్రీరాముడి జన్మస్థలమైన ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్య, సీతాదేవి జన్మస్థలంగా ప్రసిద్ధి చెందిన నేపాల్‌లోని జనక్‌పూర్ ధామ్‌లను అనుసంధానిస్తూ ఈ నెల 23వ తేదీ నుంచి వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలును నడపనున్నట్లు ప్రకటించింది.సుమారు 604 కిలోమీటర్ల దూరం ప్రయాణించే ఈ రైలు ప్రతి శనివారం జనక్‌పూర్ ధామ్ నుంచి బయలుదేరుతుంది. తిరుగు ప్రయాణంలో ప్రతి సోమవారం అయోధ్య నుంచి జనక్‌పూర్ ధామ్‌కు బయలుదేరుతుంది. ఈ రైలు ద్వారా రెండు దేశాల్లోని ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రాలను సందర్శించాలనుకునే భక్తులకు ప్రయాణ సౌకర్యం కలగనుంది.ప్రయాణ మార్గంలో అయోధ్య ధామ్, మన్కాపూర్, బస్తీ, గోరఖ్‌పూర్, నర్కటియాగంజ్, రక్సౌల్, సీతామర్హి, షిషో, మధుబని, జైనగర్ తదితర స్టేషన్లలో రైలు ఆగనుంది. ఈ రైలు సేవలు ప్రారంభమైతే భారత్, నేపాల్ మధ్య ఆధ్యాత్మిక పర్యాటకానికి మరింత ప్రోత్సాహం లభించనుంది.



జాతీయస్థాయి కరాటే పోటీల్లో వంగర గురుకుల విద్యార్థినికి స్వర్ణ పతకం

భీమదేవరపల్లి, నవంబర్ 15 (ప్రజా నేస్తం జ్వాల):



చదువుతో పాటు క్రీడల్లోనూ రాణిస్తూ వంగర బాలికల గురుకుల పాఠశాల విద్యార్థిని రుత్విక జాతీయస్థాయిలో ప్రతిభ చాటింది. జాతీయస్థాయి కరాటే పోటీల్లో స్వర్ణ పతకం సాధించి పాఠశాలకు, మండలానికి గుర్తింపు తీసుకొచ్చింది. ఆదివారం వరంగల్ జిల్లా కాజీపేటలో నిర్వహించిన జాతీయస్థాయి కరాటే పోటీల్లో వంగర బాలికల గురుకుల పాఠశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం చదువుతున్న రుత్విక పాల్గొంది. పోటీల్లో తన ప్రతిభను ప్రదర్శించి ప్రత్యర్థులను అధిగమిస్తూ గోల్డ్ మెడల్ కైవసం చేసుకుంది. విద్యార్థిని సాధించిన విజయంపై పాఠశాల ప్రిన్సిపల్ హర్షం వ్యక్తం చేశారు. రుత్వికను అభినందిస్తూ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

శబరిమల నుంచి నేరుగా ఇంటికే అయ్యప్ప ప్రసాదం

హనుమకొండ, నవంబర్ 15 (ప్రజానేస్తం జ్వాల):



శబరిమల అయ్యప్ప స్వామి దర్శనానికి వెళ్లే భక్తుల సౌకర్యార్థం ఇండియా పోస్ట్, ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు సంయుక్తంగా ప్రత్యేక పోస్టల్ సేవలను అందుబాటులోకి తీసుకురానున్నాయి. దర్శనం అనంతరం భక్తులు ప్రసాదాలను తమ వెంట తీసుకెళ్లే ఇబ్బందులు లేకుండా, శబరిమల సన్నిధానం నుంచే నేరుగా వారి ఇళ్లకు పంపించే ఏర్పాట్లు చేస్తున్నాయి.ప్రసాదాలను ప్రత్యేకంగా బుక్ చేసుకునే అవకాశం కల్పించనున్నారు. భక్తులు అందించిన చిరునామాలకు ఇండియా పోస్ట్ ద్వారా ప్రసాదాలను పంపించనున్నారు. శబరిమల సన్నిధానంలోని ప్రత్యేక కౌంటర్‌లో భక్తులు తమ చిరునామా నమోదు చేసి ఈ సేవలను వినియోగించుకోవచ్చు. నవంబర్ 17 నుంచి ప్రారంభం కానున్న 41 రోజుల మండల-మకరవిళక్కు యాత్రా సీజన్ నేపథ్యంలో ఈ ప్రత్యేక సేవలు భక్తులకు అందుబాటులోకి రానున్నాయి. రద్దీ సమయంలో ప్రసాదాలను వెంట తీసుకెళ్లే ఇబ్బందులు లేకుండా ఇంటి వద్దకే చేరవేయడం ఈ సేవల ప్రధాన ఉద్దేశం.

హమాలీలతో కలిసి వడ్ల బస్తా మోసిన కాజీపేట ఏసీపీ ప్రశాంత్ రెడ్డి

హనుమకొండ, నవంబర్ 15 (ప్రజానేస్తం జ్వాల):



విధి నిర్వహణలో నిత్యం బిజీగా ఉండే ఓ పోలీసు అధికారి శ్రమజీవులతో కలిసి పనిచేస్తూ తనలోని మానవత్వాన్ని చాటుకున్నారు. హనుమకొండ జిల్లా వేలేరు మండలం మల్లికుదుర్ల గ్రామంలో రోడ్డుపై ధాన్యాన్ని ట్రాక్టర్‌లోకి ఎక్కిస్తున్న హమాలీలను కాజీపేట ఏసీపీ ప్రశాంత్ రెడ్డి గమనించారు.వెంటనే వాహనం దిగి హమాలీల వద్దకు వెళ్లి వారిని ఆప్యాయంగా పలకరించారు. వారి పని విధానం, ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం హమాలీలతో కలిసి స్వయంగా ధాన్యం బస్తాను భుజంపైకి ఎత్తుకుని మోశారు. రోజూ హమాలీలు ఎంతటి శ్రమతో బరువైన బస్తాలను మోస్తున్నారో ప్రత్యక్షంగా తెలుసుకునే ప్రయత్నం చేశారు. ఏసీపీ ప్రశాంత్ రెడ్డి స్వయంగా వడ్ల బస్తా మోస్తున్న దృశ్యాలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. ఈ ఘటన స్థానికుల దృష్టిని ఆకర్షించడంతో పాటు నెటిజన్ల నుంచి స్పందన పొందుతోంది.

ఈ నెల 22న కేడీసీ మైదానంలో కేటీఆర్ బహిరంగ సభ

హనుమకొండ, నవంబర్ 15 (ప్రజానేస్తం జ్వాల):



ఈ నెల 22వ తేదీన హనుమకొండలోని కేడీసీ (KDC) మైదానంలో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొననున్న బహిరంగ సభ నిర్వహణకు అనుమతి కోరుతూ పార్టీ నాయకులు పోలీసు అధికారులను కలిశారు. మాజీ ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ ఆదేశాల మేరకు బీఆర్ఎస్వీ కాకతీయ యూనివర్సిటీ అధ్యక్షుడు బైరపాక ప్రశాంత్, యువ నాయకుడు తక్కెళ్లపల్లి వినీల్ రావు హనుమకొండ ఏసీపీ నరసింహారావును కలిసి సభ నిర్వహణకు సంబంధించిన అనుమతి దరఖాస్తును అందజేశారు. ఈ సందర్భంగా సభకు విద్యార్థులు, యువకులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యే అవకాశం ఉన్నందున తగిన భద్రతా ఏర్పాట్లు చేయడంతో పాటు ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను కోరారు.

ఉమ్మడి వరంగల్ జిల్లాకు 55,798 నూతన పింఛన్లు మంజూరు

హనుమకొండ, నవంబర్ 15 (ప్రజానేస్తం జ్వాల):

తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన నిరుపేదలకు కొత్తగా 4.63 లక్షల పింఛన్లు మంజూరు చేసేందుకు ఆర్థిక శాఖ ఆమోదం తెలపడంతో ఉమ్మడి వరంగల్ జిల్లాకు ప్రయోజనం చేకూరింది. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా మొత్తం 55,798 మందికి నూతన పింఛన్లు మంజూరయ్యాయి. ఈ నెల 19వ తేదీ నుంచి లబ్ధిదారుల ఖాతాల్లో పింఛన్ నగదు జమ చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది.మంజూరైన పింఛన్ల వివరాల ప్రకారం 31,775 మంది వితంతువులు, 13,407 మంది దివ్యాంగులు, 4,731 మంది ఒంటరి మహిళలు, 5,062 మంది గీత కార్మికులు, 823 మంది చేనేత కార్మికులు లబ్ధి పొందనున్నారు. దీర్ఘకాలంగా కొత్త పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న అర్హులైన పేదలకు ఈ నిర్ణయం ప్రయోజనం చేకూర్చనుంది. నూతన పింఛన్ల మంజూరుతో లబ్ధిదారుల్లో ఆశలు చిగురించాయి.



ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

హనుమకొండ కలెక్టరేట్‌లో రేపు ప్రత్యేక పిల్లల ప్రజావాణి

హనుమకొండ, నవంబర్ 15 (ప్రజానేస్తం జ్వాల):



జాతీయ బాలల హక్కుల వారోత్సవాలను పురస్కరించుకుని హనుమకొండ జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం ప్రత్యేకంగా పిల్లల ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ తెలిపారు. బాలల హక్కుల పరిరక్షణతో పాటు చిన్నారులు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.విద్య, వైద్యం, పోషకాహారం, రక్షణ, పాఠశాలల్లో కనీస సౌకర్యాలు, సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలకు సంబంధించి పిల్లలు ఎదుర్కొంటున్న సమస్యలను కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసే ప్రత్యేక డెస్క్ ద్వారా అధికారుల దృష్టికి తీసుకురావచ్చని తెలిపారు. చిన్నారులు తమ సమస్యలపై వినతులు సమర్పించవచ్చని, సంబంధిత శాఖల అధికారుల ద్వారా పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వెల్లడించారు.

శబరిమల ప్రత్యేక రైళ్ల కేటాయింపులో కాజీపేటకు అన్యాయం?.. ఉమ్మడి వరంగల్ అయ్యప్ప భక్తుల ఆవేదన!

హనుమకొండ, 15 నవంబర్ 2026 (ప్రజానేస్తం జ్వాల):



శబరిమల అయ్యప్ప స్వామి దర్శనానికి వెళ్లే భక్తుల సౌకర్యార్థం దక్షిణ మధ్య రైల్వే (గ్రాజ=) ప్రకటించిన ప్రత్యేక రైళ్ల కేటాయింపుపై ఉమ్మడి వరంగల్ జిల్లా అయ్యప్ప భక్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యేక రైళ్ల కేటాయింపులో కాజీపేట రైల్వే జంక్షన్‌కు తగిన ప్రాధాన్యత ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.రైల్వే శాఖ ప్రకటించిన వివరాల ప్రకారం నల్గొండ మార్గానికి 48 ట్రిప్పులు కేటాయించగా, అత్యంత రద్దీగా ఉండే కాజీపేట--ఖమ్మం మార్గానికి కేవలం 6 ట్రిప్పులు మాత్రమే కేటాయించడంపై భక్తులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో అయ్యప్ప స్వాములు శబరిమల యాత్రకు తరలివెళ్తుంటారని, అందుకు అనుగుణంగా ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని పేర్కొంటున్నారు.ప్రస్తుతం సాధారణ రైళ్లలోనే ప్రయాణికుల రద్దీ అధికంగా ఉందని, రెండు నెలల ముందుగానే టికెట్లకు రిగ్రెట్ బోర్డులు, భారీ వెయిటింగ్ లిస్టులు కనిపిస్తున్నాయని భక్తులు చెబుతున్నారు. దీంతో అయ్యప్ప స్వాములు, వారి కుటుంబ సభ్యులు, వృద్ధులు, చిన్నారులు రైలు ప్రయాణానికి టికెట్లు లభించక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దక్షిణ మధ్య రైల్వే ఉన్నతాధికారులు ఈ విషయంపై తక్షణమే స్పందించాలని భక్తులు కోరుతున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి శబరిమలకు వెళ్లే యాత్రికుల రద్దీని పరిగణనలోకి తీసుకుని కాజీపేట జంక్షన్ మీదుగా మరిన్ని ప్రత్యేక రైళ్లను నడపాలని డిమాండ్ చేస్తున్నారు. భక్తుల ప్రయాణ అవసరాలను దృష్టిలో ఉంచుకుని రైల్వే శాఖ తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

హనుమకొండ రాంపూర్ స్టేజ్ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం.. టైరు పేలి ఇన్నోవా బోల్తా.. ఏడుగురికి తీవ్ర గాయాలు!

హనుమకొండ, 15 నవంబర్ 2026 (ప్రజానేస్తం జ్వాల):



హనుమ కొండ సమీపంలోని రాంపూర్ స్టేజ్ వద్ద ఆదివారం తెల్లవారు జామున ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ప్రయాణికులతో వెళ్తున్న ఇన్నోవా కారు ముందు టైరు ఒక్కసారిగా పేలిపోవడంతో వాహనం అదుపుతప్పి రోడ్డుపై బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు.తెల్లవారుజామున జరిగిన ఈ ఘటనతో స్థానికులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే స్పందించి క్షతగాత్రులను వాహనం నుంచి బయటకు తీసేందుకు సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాద సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు.ఈఎంటీ లింగాల శివకుమార్, అంబులెన్స్ పైలట్ సాదం కుమారస్వామి క్షతగాత్రులకు ఘటనా స్థలంలోనే ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఏడుగురినీ వరంగల్‌లోని ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు.అకస్మాత్తుగా టైరు పేలడంతోనే ఈ ప్రమాదం జరిగినట్లు ప్రాథమికంగా తెలుస్తోంది.

హుజూర్‌నగర్‌లో ఘోర రోడ్డు ప్రమాదం.. లారీ ఢీకొని ద్విచక్ర వాహనదారుడు మృతి!

హుజూర్‌నగర్, 15 నవంబర్ 2026 (ప్రజానేస్తం జ్వాల):



హుజూర్‌నగర్ పట్టణంలోని దీక్షిత్‌నగర్ సమీప బైపాస్ రోడ్డుపై ఆదివారం సాయంత్రం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. లారీ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో ఒకరు అక్కడికక్కడే మృతిచెందగా, మరొకరికి గాయాలయ్యాయి.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హుజూర్‌నగర్ పట్టణానికి చెందిన పంగా నాగరాజు (40), ఎల్లవుల సురేందర్ ఇద్దరూ ూ29జ2968 నంబరు గల ద్విచక్ర వాహనంపై బైపాస్ రోడ్డును దాటుతున్నారు. అదే సమయంలో హుజూర్‌నగర్ నుంచి మిర్యాలగూడ వైపు AP39WK2449 నంబరు గల లారీని నడుపుకుంటూ వెళ్తున్న డ్రైవర్ అతి వేగంగా, అజాగ్రత్తగా వాహనాన్ని నడిపి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనం నడుపుతున్న పంగా నాగరాజు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. వెనుక కూర్చున్న ఎల్లవుల సురేందర్‌కు గాయాలయ్యాయి.ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్‌ను ఇలపోగు డేవిడ్ (39), తండ్రి కోటయ్యగా పోలీసులు గుర్తించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన హుజూర్‌నగర్ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ చేయూత పింఛన్లు అందించడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యం

నడికూడ, నవంబర్ 15 (ప్రజానేస్తం జ్వాల):

అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందించడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. అర్హులైన పేదలు, నిరుపేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన పేర్కొన్నారు.ఆదివారం నడికూడ మండల కేంద్రంలోని ఎంఆర్సీ భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో మండల పరిధిలో నూతనంగా మంజూరైన చేయూత పింఛన్ల మంజూరు పత్రాలను ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, నేత కార్మికులు, గీత కార్మికులకు ప్రభుత్వం మంజూరు చేసిన పింఛన్ల పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సమాజంలోని అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందాలన్నదే ప్రభుత్వ సంకల్పమని తెలిపారు. ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేదలకు చేయూత పింఛన్లు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని, ప్రభుత్వం కల్పిస్తున్న ఈ ఆర్థిక భరోసాను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందించడంలో ఎలాంటి వివక్షకు తావులేకుండా ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.



ఢిల్లీ ఎయిమ్స్ వైద్యుల అరుదైన ఘనత.. తల్లి గర్భంలోనే 25 వారాల పిండానికి స్పైనల్ సర్జరీ!

హనుమకొండ, 15 నవంబర్ 2026 (ప్రజానేస్తం జ్వాల):

భారత వైద్యరంగంలో అరుదైన ఘనత నమోదైంది. ఢిల్లీలోని అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ (ఎయిమ్స్) వైద్య బృందం తల్లి గర్భంలో ఉన్న 25 వారాల పిండానికి క్లిష్టమైన వెన్నెముక శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించినట్లు వెల్లడైంది. దేశంలోనే తొలిసారిగా ఈ తరహా ఓపెన్ ఫీటల్ సర్జరీ నిర్వహించినట్లు వచ్చిన సమాచారం వైద్యరంగంలో ఆసక్తిని రేకెత్తిస్తోంది.పిండానికి 'లంబోసాక్రల్ మైలోమెనింగోసీల్' అనే జన్మసంబంధిత లోపం ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. ఈ సమస్యలో వెన్నెముక పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందకపోవడంతో వెన్నుపాము, దాని చుట్టూ ఉండే పొరలు బయటకు పొడుచుకు వస్తాయి. దీనివల్ల శిశువు పుట్టిన తర్వాత నరాల సంబంధిత సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంటుంది.ఈ లోపానికి తగిన సమయంలో చికిత్స అందకపోతే కాళ్లలో స్పర్శ తగ్గడం, కండరాల బలహీనత, నడవడంలో ఇబ్బందులు, మూత్రం, మల విసర్జనపై నియంత్రణ కోల్పోవడం వంటి సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉంది. ఇలాంటి సమస్యల తీవ్రతను తగ్గించే లక్ష్యంతో గర్భంలోనే శస్త్రచికిత్స నిర్వహించడం వైద్యపరంగా కీలకమైన పరిణామంగా భావిస్తున్నారు. అత్యంత సున్నితమైన ఈ శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించిన ఎయిమ్స్ వైద్య బృందంపై ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి. ఆధునిక వైద్య సాంకేతికతతో గర్భస్థ శిశువులకూ చికిత్స అందించే అవకాశాలు మరింత విస్తరిస్తున్నాయనే దానికి ఈ ఘటన నిదర్శనంగా నిలుస్తోంది.



ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా భరోసా

పేద కుటుంబాలకు ఆర్థిక రక్షణ కవచంగా ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం

నవంబర్ 19న సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం

సూర్యాపేట జిల్లాలో 3.29 లక్షల కుటుంబాలకు ప్రయోజనం చేకూర్చేలా కార్యాచరణ

అర్హుల గుర్తింపు, పారదర్శక నమోదు ప్రక్రియపై కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ప్రత్యేక దృష్టి

సూర్యాపేట, నవంబర్ 15 (ప్రజానేస్తం జ్వాల):

కుటుంబానికి ఆధారంగా నిలిచే వ్యక్తి అనుకోకుండా మరణిస్తే ఆ కుటుంబం ఆర్థికంగా కుంగిపోకుండా అండగా నిలిచేందుకు తెలంగాణ ప్రభుత్వం 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం'ను ప్రవేశపెడుతోంది. కుటుంబంలో సంపాదించే అర్హత కలిగిన వ్యక్తి మరణించిన సందర్భంలో రూ.5 లక్షల జీవిత బీమా రక్షణ కల్పించడం ఈ పథకం ప్రధాన ఉద్దేశం. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకుని నవంబర్ 19న ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి ఈ పథకాన్ని ప్రారంభించనున్నారు.

కుటుంబానికి ఆర్థిక భరోసా

కుటుంబంలో సంపాదించే వ్యక్తి మరణిస్తే పిల్లల చదువులు, కుటుంబ పోషణ, గృహ అవసరాలు, అప్పుల చెల్లింపులు వంటి బాధ్యతలు మిగిలిన కుటుంబ సభ్యులకు భారంగా మారుతాయి. ముఖ్యంగా రోజువారీ కూలి పనులు, అసంఘటిత రంగాల్లో పనిచేస్తూ జీవించే కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటాయి. ఇలాంటి పరిస్థితుల్లో బాధిత కుటుంబాలకు ఆర్థిక ఆసరా కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ పథకాన్ని రూపొందించింది.కుటుంబానికి ఆదాయాన్ని సమకూర్చే వ్యక్తిని కోల్పోయిన సందర్భంలో రూ.5 లక్షల బీమా మొత్తం అందించడం ద్వారా ఆ కుటుంబం ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు అవకాశం కల్పించనున్నారు.

18 నుంచి 59 ఏళ్ల వయస్సు వారికి అవకాశం

ప్రభుత్వం ప్రకటించిన వివరాల ప్రకారం 18 నుంచి 59 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన కుటుంబంలో ఉపాధి పొందుతూ కుటుంబ పోషణకు తోడ్పడే అర్హత కలిగిన వ్యక్తికి బీమా వర్తించనుంది. ఒక కుటుంబంలో ఒకరి కంటే ఎక్కువ మంది ఉపాధి పొందుతున్నట్లయితే వారిలో ఎవరికి బీమా రక్షణ కల్పించాలనే విషయాన్ని కుటుంబ సభ్యులు నిర్ణయించుకునే అవకాశం కల్పిస్తున్నారు.కులమతాలకు అతీతంగా అర్హులైన కుటుంబాలకు ఈ పథకం ప్రయోజనం అందించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. అర్హత నిర్ధారణకు ఆధార్ కార్డులో నమోదైన పుట్టిన తేదీని ప్రామాణికంగా తీసుకోనున్నారు.

నామినీ ఎంపికలో వెసులుబాటు

ఈ పథకంలో బీమా పొందే వ్యక్తి తన కుటుంబ సభ్యులను నామినీలుగా ఎంపిక చేసుకునే అవకాశం ఉంటుంది. ఒకరి కంటే ఎక్కువ మందిని నామినీలుగా ఎంపిక చేసుకుంటే రూ.5 లక్షల బీమా మొత్తాన్ని వారికి ఏ నిష్పత్తిలో పంపిణీ చేయాలనే వివరాలను కూడా నమోదు చేసుకోవచ్చు.నామినీల పేర్లు, సంబంధాలు, ఆధార్ వివరాలు, వారికి కేటాయించే వాటాలను నమోదు చేసే సమయంలో కుటుంబ సభ్యులు జాగ్రత్తగా పరిశీలించుకోవాల్సి ఉంటుంది. నమోదు పూర్తయిన తర్వాత వివరాలను మరోసారి ధ్రువీకరించుకోవడం ద్వారా భవిష్యత్తులో సమస్యలు తలెత్తకుండా నివారించవచ్చు.

నవంబర్ 14 నుంచి 18 వరకు అవగాహన కార్యక్రమాలు

పథకంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు నవంబర్ 14 నుంచి 18 వరకు గ్రామాలు, పట్టణాల్లో విస్తృత ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో డప్పు చాటింపు, దండోరా ద్వారా ప్రజలకు సమాచారం అందించనున్నారు. పట్టణ ప్రాంతాల్లోనూ ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు చేపట్టనున్నారు.పథకం ఉద్దేశం, అర్హతలు, వయస్సు పరిమితి, బీమా మొత్తం, నామినీ ఎంపిక, నమోదు విధానం తదితర అంశాలను ప్రజలకు వివరించనున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలు, మారుమూల ఆవాసాలు, పట్టణాల్లోని పేద కుటుంబాలకు సమాచారం చేరేలా అధికారులు చర్యలు తీసుకోనున్నారు.

నవంబర్ 19 నుంచి ప్రత్యేక నమోదు కేంద్రాలు

పథకం ప్రారంభమైన నవంబర్ 19 నుంచి గ్రామాలు, పట్టణాల్లో ప్రత్యేక నమోదు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. గ్రామ పంచాయతీ స్థాయిలో గ్రామీణ ప్రాంతాలకు, మున్సిపల్ యంత్రాంగం ఆధ్వర్యంలో పట్టణ ప్రాంతాలకు సంబంధించిన నమోదు ప్రక్రియ చేపట్టనున్నారు.కుటుంబ సభ్యులు ఎంపిక చేసుకున్న బీమా పొందే వ్యక్తి వివరాలు, నామినీల పేర్లు, బీమా మొత్తం పంపిణీ నిష్పత్తిని డిజిటల్ విధానంలో నమోదు చేయనున్నారు. నమోదు పూర్తయిన తర్వాత వివరాలను సంబంధిత కుటుంబ సభ్యులకు చదివి వినిపించి, వారి అంగీకారంతో ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

సూర్యాపేట జిల్లాలో 3.29 లక్షల కుటుంబాలకు ప్రయోజనం

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని సూర్యాపేట జిల్లాలో పకడ్బందీగా అమలు చేసేందుకు జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ప్రత్యేక దృష్టి సారించారు. జిల్లాలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మొత్తం 3,29,974 కుటుంబాలకు పథకం వివరాలు చేరేలా కార్యాచరణ రూపొందించారు.జిల్లాలోని 23 మండలాల పరిధిలో 486 గ్రామ పంచాయతీల ద్వారా 2,41,188 కుటుంబాలకు, ఐదు మున్సిపాలిటీల పరిధిలోని 141 వార్డుల ద్వారా 88,746 కుటుంబాలకు అవగాహన కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, క్షేత్రస్థాయి సిబ్బంది సమన్వయంతో పనిచేయనున్నారు. అర్హుల గుర్తింపు, వివరాల సేకరణ, నమోదు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నారు.

పారదర్శక నమోదుకు కలెక్టర్ ఆదేశాలు

పథకం అమలులో ప్రతి అర్హ కుటుంబానికి సమాచారం చేరడం ముఖ్యమని కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ సూచించారు. ఆధార్‌లోని పుట్టిన తేదీ ఆధారంగా వయస్సును నిర్ధారించాలని, బీమా కోసం ఎంపిక చేసిన వ్యక్తి వివరాలు, నామినీల పేర్లు, వారికి కేటాయించే వాటాలను ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నమోదు చేయాలని అధికారులకు సూచించారు.నమోదు పూర్తయిన తర్వాత వివరాలను మరోసారి పరిశీలించి కుటుంబ సభ్యుల అంగీకారంతో ప్రక్రియను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ లక్ష్యం క్షేత్రస్థాయిలో అమలయ్యేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

కష్టకాలంలో కుటుంబాలకు ఆర్థిక ఆసరా

కుటుంబ పెద్దను లేదా కుటుంబ పోషణలో కీలకంగా ఉన్న వ్యక్తిని కోల్పోయిన బాధను ఏ ఆర్థిక సహాయం భర్తీ చేయలేకపోయినా, ఆ సమయంలో కుటుంబం పూర్తిగా ఆర్థిక సంక్షోభంలోకి వెళ్లకుండా బీమా మొత్తం కొంతవరకు తోడ్పడనుంది. పిల్లల చదువులు, కుటుంబ పోషణ, ఇతర అత్యవసర అవసరాలకు ఈ మొత్తం ఉపయోగపడే అవకాశం ఉంది.ప్రభుత్వం చేపడుతున్న ఈ పథకంపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు అర్హులైన కుటుంబాల వివరాలను సక్రమంగా నమోదు చేయడం కీలకం కానుంది. నవంబర్ 19 నుంచి ప్రారంభమయ్యే నమోదు కార్యక్రమంలో అర్హులైన కుటుంబాలు పాల్గొని తమ వివరాలను అందించాలని అధికారులు సూచిస్తున్నారు.ప్రతి కుటుంబానికి జీవిత బీమా రక్షణ కల్పించాలనే లక్ష్యంతో ప్రారంభమవుతున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం సమర్థవంతంగా అమలైతే కష్టకాలంలో అనేక కుటుంబాలకు ఆర్థిక ఆసరాగా నిలవనుంది.

